FLASH INDIA NEWS
www.flashindianews.com
# ఫ్లాష్ ఇండియా
తెలుగు దినపత్రిక
FLASH INDIA TELUGU DAILY
RNI NO.APTEL/2010/33229

విలేకరులు కావలెను
18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 156 | శుక్రవారం 24.07.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-



# ఢిల్లీలో ఆంక్షలు తీవ్రం..

## నేడు దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపు

### అల్లర్లలో పాల్గొంటే పాస్‌పోర్ట్ రద్దు హెచ్చరిక

- అల్లర్ల నేపథ్యంలో సెంట్రల్ ఢిల్లీలో ఇంటర్నెట్ నిలిపివేత
- సీజేపీతో చర్చలకు కేంద్రం నాలుగోసారి ఆహ్వానం
- జంతర్‌మంతర్‌కే రావాలని కేంద్రానికి సీజేపీ అల్టిమేటం
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై వెనక్కి తగ్గేది లేదు: సీజేపీ
- పేపర్ లీక్ కేసులకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు: ప్రధాని మోదీ 03
- అల్లర్లలో పాల్గొంటే పాస్‌పోర్ట్ రద్దు హెచ్చరిక
- హింసాత్మక నిరసనలపై కఠిన చర్యలకు ఢిల్లీ పోలీసులు సిద్ధం
- జులై 24న దేశవ్యాప్తంగా నిరసనలకు సీజేపీ పిలుపు
- విద్యార్థుల ఉద్యమానికి దేశవ్యాప్తంగా పెరుగుతున్న మద్దతు
- లాఠీచార్జ్ తర్వాత మరింత ఉధృతమైన నిరసనలు
- నీట్ ఉద్యమంపై కాంగ్రెస్-బీజేపీ మధ్య మాటల యుద్ధం
- విద్యార్థుల నిరసనలతో ఢిల్లీలో భద్రత కట్టుదిట్టం
- సీఎంపీ, జంతర్‌మంతర్ ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం
- చర్చలకు సిద్ధమన్న కేంద్రం.. జంతర్‌మంతర్‌కే రావాలన్న సీజేపీ

### ఏ సమయంలోనైనా చర్చలకు సిద్ధం..
### సీజేపీకి కేంద్రం మరోసారి పిలుపు..

దేశ రాజధాని ఢిల్లీలో సీజేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళనలు ఉధృతం అవుతున్న నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు కఠిన నిర్ణయం తీసుకున్నారు. అల్లర్లకు పాల్పడినట్లు గుర్తించిన వ్యక్తులపై క్రిమినల్ కేసులతో పాటు వారి పాస్‌పోర్ట్ రద్దు ప్రక్రియను కూడా ప్రారంభించనున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. హింసాత్మక నిరసనల్లో పాల్గొన్న వారిపై చట్టపరమైన చర్యలతో పాటు పరిపాలనా పరమైన చర్యలు కూడా తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం.గత సోమవారం సీజేపీ నిర్వహించిన 'చలో సంసద్' ర్యాలీలో నిరసనకారులు పార్లమెంట్ భద్రతా బారికేడ్లను దాటేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించడం, లాఠీచార్జ్ చేయడం, అల్లర్ల నియంత్రణ వాహనాలను వినియోగించడం జరిగింది. ఈ ఘటనల్లో పలువురు నిరసనకారులు, పోలీసు సిబ్బంది స్వల్పంగా గాయపడ్డారు. అదే సమయంలో తమ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సీజేపీ ఆరోపించింది.

# ఆయనవన్నీ వేరే పార్టీలు

నాకు రెండు ఓట్లు ఉంటే ఫిర్యాదు చేయొచ్చు

## సర్ ప్రక్రియపై సీఎం రేవంత్ రెడ్డి అనుమానాలు

### ఓటర్ల జాబితా ప్రక్షాళనపై దృష్టి
### తొలగింపు కాదు.. ప్రక్షాళన కావాలి
### తండావాసుల ఓట్లను కాపాడే బాధ్యత కార్యకర్తలదే..
### కాంగ్రెస్ శ్రేణులకు రేవంత్ రెడ్డి పిలుపు

గ్లోబరీనా కేటీఆర్ బినామీ సంస్థే



- నీట్ కుంభకోణానికి గ్లోబరీనా కారణం: సీఎం ఆరోపణ
- 27 మంది మరణాలకు గ్లోబరీనా తప్పిదాలే కారణం: రేవంత్
- ధర్మేంద్ర ప్రధాన్‌పై బీఆర్ఎస్ ఎందుకు మౌనం?
- అమరవీరుల స్తూపం వద్ద కేటీఆర్ క్షమాపణ చెప్పాలి: సీఎం 03
- కేటీఆర్ బర్త్‌డేపై సీఎం రేవంత్ సెటైర్లు
- హరీశ్‌రావుపై సీఎం ఘాటు వ్యాఖ్యలు
- మేడిగడ్డపై ఎందుకు మాట్లాడడం లేదు?: బీఆర్ఎస్‌ను ప్రశ్నించిన సీఎం
- సర్ ప్రజలకు సంబంధించిన అంశం.. రాజకీయాలకు కాదు

కేటీఆర్ బర్త్ డే పై సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'కేటీఆర్ పుట్టిన రోజు దావత్ ఇస్తాడో అడగాలి. కేటీఆర్ ఇచ్చే దావత్ నేను తీసుకోలేనేమో. ఆయనవి అన్నీ వేరే పార్టీలు' అంటూ సెటైర్ విసిరారు. హరీశ్ గొప్పవాడైతే మంత్రి పదవి నుంచి ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. అతి తెలివి తేటలతో ఏదిపడితే అది మాట్లాడతానంటే నడవదని హరీశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు కన్నెపెల్లి పంపు హౌజ్ గురించి మాట్లాడుతున్నారని... మేడిగడ్డ గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. మేడిగడ్డ గురించి మాట్లాడితే ప్రజలు చెప్పుతో కొడతారని మండిపడ్డారు. మేడిగడ్డ కట్టింది, కూల్చింది బీఆర్ఎస్ వాళ్లే...



## 108 దేశాలు, 12 వేల మంది పోటీదారులు..

### ప్రపంచ అంతరిక్ష మిషన్‌కు ఎంపికైన ఏపీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని!

- 108 దేశాల పోటీలో భారత్ తరఫున జెస్సీ ఎంపిక
- 12 వేల మంది పోటీలో టాప్-20లో చోటు
- ప్రపంచ తొలి ఆల్-గర్ల్స్ లూనార్ క్యూబ్‌శాట్ మిషన్‌లో తెలుగు అమ్మాయి 02

# సీజేఐ కీలక వ్యాఖ్యలు

## మెట్రో స్టేషన్లు తెరవకపోతే జోక్యం చేసుకుంటా

ఢిల్లీలో ఆందోళనల ఎఫెక్ట్..

- 'మధ్యాహ్నంలోగా పరిష్కారం లేకపోతే నేనే జోక్యం చేసుకుంటా'
- సుప్రీంకోర్టుకు చేరుకోలేక న్యాయవాదుల ఆందోళన 02
- మెట్రో మూసివేతతో కోర్టు కార్యకలాపాలకు అంతరాయం
- సుప్రీంకోర్టు స్టేషన్‌కు పరిమిత ప్రవేశం కల్పించాలని ప్రతిపాదన
- విద్యార్థుల నిరసనలతో ఢిల్లీలో రవాణా వ్యవస్థ అస్తవ్యస్తం



ఢిల్లీ విద్యార్థుల ఆందోళనతో 16 మెట్రో స్టేషన్లు మూసివేత



## నీట్ పేపర్ లీక్‌లో కాంగ్రెస్ వారే

- భారత్‌లో జెన్-జీ తరహా అలజడి సృష్టించే కుట్ర: రామచందర్ రావు
- శ్రీలంక, బంగ్లాదేశ్ తరహా పరిస్థితులు తీసుకురావాలనే ప్రయత్నం
- సీజేపీ ఆందోళనలకు విదేశీ శక్తుల మద్దతు ఉందన్న బీజేపీ 03



## హుస్నాబాద్ అభివృద్ధే ధ్యేయం

- ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తం.. అధికారులకు మంత్రి ఆదేశాలు
- వర్షాభావంపై మూడు జిల్లాల కలెక్టర్లతో పొన్నం సమీక్ష
- రైతులకు ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- తాగునీరు, పశుగ్రాస కొరతపై ప్రత్యేక కార్యాచరణ 03

# గన్‌తో కాల్చుకుని కానిస్టేబుల్ సూసైడ్

- భార్య, పిల్లల గురించి భావోద్వేగంగా రాసిన సూసైడ్ నోట్
- ఉన్నతాధికారుల సమక్షంలో ఘటనపై విచారణ
- కానిస్టేబుల్ ఆత్మహత్య వెనుక కారణాలపై దర్యాప్తు
- వ్యక్తిగత, ఉద్యోగ సంబంధిత కోణాల్లో విచారణ 03




# ఆర్మీ భూముల జోలికి వస్తే సంకెళ్లు

## ప్రైవేట్ భూముల్లో జోక్యంపై హైడ్రాకు చురకలు

- హైడ్రా, పోలీసులకు హైకోర్టు గట్టి హెచ్చరిక
- ఆర్మీ భూముల జోలికి వస్తే వెంటనే కోర్టుకు సమాచారం
- లోతుకుంట భూముల వివాదంపై హైకోర్టు సీరియస్
- హైడ్రా వ్యవహారశైలిపై న్యాయస్థానం అసహనం 02
- కోర్టు ఆదేశాలను ఎందుకు పాటించడం లేదు?: హైకోర్టు ప్రశ్న
- ప్రైవేట్ భూముల్లో జోక్యంపై హైడ్రాకు చురకలు





# ఒక్కసారైనా సీఎంలా ప్రవర్తించు..

## పేపర్ లీక్ ఘటనపై రాజకీయాలు చేయొద్దు

### క్షమాపణలు చెప్పకుంటే లీగల్ నోటీసులు పంపిస్తా..
### గ్లోబల్ ఏరినా సంస్థతో నాకు సంబంధం లేదు
### సీఐడీ విచారణకు సిద్ధమా రేవంత్ రెడ్డి?

- గ్లోబరీనా సంస్థతో నాకు ఎలాంటి సంబంధం లేదు: కేటీఆర్
- రేవంత్ రెడ్డి ఆరోపణలు పూర్తిగా అవాస్తవం
- సీఐడీ విచారణకు నేను సిద్ధం.. సీఎం సిద్ధమేనా?
- లై డిటెక్టర్ పరీక్షకైనా సిద్ధమేనని కేటీఆర్ సవాల్ 05
- కేంద్రాన్ని ప్రశ్నించకుండా రాజకీయ నాటకాలు
- రేవంత్ కుటుంబంపై సిట్, సీఐడీ విచారణకు సిద్ధమేనా?
- అవాస్తవ ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు
- గ్లోబరీనా వివాదంపై కేటీఆర్ ఘాటు స్పందన
- పరువు నష్టం కేసు వేస్తామని కేటీఆర్ హెచ్చరిక
- మోదీ పేరును ప్రస్తావించడానికి సీఎం భయపడుతున్నారు

పేపర్ లీక్ లాంటి దురదృష్టకర ఘటనపై ముఖ్యమంత్రి పదవిలో ఉంటూ బాధ్యతాయుతంగా రాహిత్యంతో చౌకబారు రాజకీయ ప్రయోజనాల కోసం అబద్ధాలను ప్రచారం చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై చేసిన ఆరోపణలను సీఎం వెంటనే ఉపసంహరించుకుని

# విద్యార్థులతో కేంద్రం చర్చలు జరపాలి



**ఢిల్లీ :** పేపర్ లీకేజీలు, విద్యా వ్యవస్థలో లోపాలపై జంతర్ మంతర్ వద్ద ఆందోళన బాట పట్టిన విద్యార్థుల డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు ప్రస్తుత వ్యవస్థపై నమ్మకాన్ని కోల్పో-యారని, వారి సమస్యలను పరిష్కరించడానికి వారితో నేరుగా మాట్లాడాలని ఆమె డిమాండ్ చేశారు. విద్యార్థులు అడుగుతున్న డిమాండ్లను వినాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ప్రియాంక పేర్కొన్నారు. వ్యవస్థ అందించే అరకొర పరిష్కారాలను విద్యార్థులు ఇకపై అంగీకరించే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, నిరసన తెలుపుతున్న విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జ్, దాడి ఘటనలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆమె కోరారు.'మీరు సోషల్ మీడియాలో విద్యార్థులపై నమ్మకం ఉందని ట్వీట్లు చేస్తారు, కానీ రాత్రికి రాత్రే వారిపై లాఠీఛార్జ్ చేయిస్తారు. నిజంగా విద్యార్థులపై శ్రద్ధ ఉంటే నేరుగా పిలిచి మాట్లాడండి' అని ఆమె కేంద్రానికి సవాల్ విసిరారు. ప్రభుత్వ తీరును విమర్శిస్తూ ఒక ఉదాహరణ ఇచ్చారు: 'పిల్లలు డిజైనర్ అవుతానంటే, తండ్రి ఏమీ వినకుండా ఇంజనీరింగ్ కాలేజీలో సీటు బుక్ చేశానని చెప్పినట్లుగా ఉంది ప్రభుత్వ ప్రవర్తన' అని ప్రియాంక అన్నారు. నాయకులు తమ భయాలను పక్కనబెట్టి, జంతర్ మంతర్ వద్ద వేలాదిగా తరలివచ్చిన యువత ఆవేదనను వినాలని, విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు ఒక నూతన బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు.

**ప్రధాని మోదీపై కేసీ వేణుగోపాల్ విమర్శలు**

కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ కేసీ వేణుగోపాల్ కూడా ఈ వ్యవహారంపై ఘాటుగా స్పందించారు. పేపర్ లీకేజీలపై ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామన్న ప్రధాని మోదీ ప్రకటనలపై ప్రజల్లో విశ్వ-సనీయత పోయిందని విమర్శించారు. నిజంగా విద్యార్థుల భవిష్యత్తుపై కాపాడే ఉద్దేశం ఉంటే, ముందుగా విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించి, ఆ తర్వాతే విద్యార్థులతో చర్చలకు కూర్చోవాలని వేణుగోపాల్ స్పష్టం చేశారు.

## ఆర్మీ భూముల జోలికి వస్తే సంకెళ్లు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసైట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ తీరుపై తెలంగాణ హైకోర్టు మ-రోసారి అత్యంత తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. సికింద్రాబాద్ లోతుకుంట పరిధిలోని భూముల విచారణ సందర్భంగా ఉన్నత న్యాయ-స్థానం హైడ్రా అధికారుల వ్యవహారశైలిని తీవ్రంగా తప్పుపట్టింది. లోతుకుంటలోని ఆర్మీ భూముల జోలికి హైడ్రా అధికారులు కానీ, పోలీసులు కానీ వెళ్తే వెంటనే వారిని అదుపులోకి తీసుకోవాలని, అవసరమైతే సంకెళ్లు వేయాలని హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. హైడ్రా అధికారులు ఆర్మీ భూముల్లోకి వస్తే వెంటనే తమ ఆధీనంలోకి తీసుకోవాలని భద్రతా వర్గాలకు, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

**కోర్టుకు వెంటనే సమాచారం ఇవ్వాలి..**

మళ్లీ ఎప్పుడైనా ఆర్మీ భూముల జోలికి హైడ్రా వస్తే, ఆ విషయాన్ని వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని న్యాయస్థానం ఆదేశించింది. లోతుకుంటలోని భూముల విషయంలో జోక్యం చేసుకోవడంపై రెండు రోజుల క్రితమే హైకోర్టు తీవ్ర స్థాయిలో మందలించినప్పటికీ, అధికారుల వైఖరి మారకపోవడంపై న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలాలు, చెరువుల పరిరక్షణ పేరుతో ప్రైవేట్, వివాదాస్పద భూముల్లోకి అనుమతి లేని రీతిలో ప్రవేశించడం, కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడంపై హైకోర్టు క్లాస్ పీకడంతో ఈ వ్యవహారం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# సీజేఐ కీలక వ్యాఖ్యలు

**న్యూ ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం విద్యార్థుల ఆందోళన కొనసాగుతోంది. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కొద్దిరోజులుగా విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. గత సోమవారం ఆందోళనలు ఉధృతం అయ్యాయి. విద్యార్థులపై లాఠీఛార్జ్ కారణంగా పలువురు గాయపడ్డారు. అప్పటి నుంచి ఉద్యమం ఉధృతం అయింది. విపక్ష పార్టీలు కూడా మద్దతుగా నిరసనలు తెలుపుతున్నారు. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో పలు మెట్రో స్టేషన్లను ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ మూసేసింది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ఉద్యోగులతో పాటు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మెట్రో స్టేషన్లు మూసివేయడంపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. మధ్యాహ్న భోజన విరామం (లంచ్)లోపు సమస్యకు పరిష్కారం లభించకపోతే తానే స్వయంగా జోక్యం చేసుకుంటానని స్పష్టం చేశారు. ఢిల్లీ మెట్రో స్టేషన్ల మూసివేత కారణంగా న్యాయవాదులు, వ్యాజ్యదారులు, సుప్రీంకోర్టు సిబ్బంది కోర్టుకు చేరుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ తరఫున వినతిపత్రం దాఖలైంది. సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఎదుట ఎస్‌సీబీఏ అధ్యక్షుడు వికాస్ సింగ్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. సుప్రీంకోర్టు మెట్రో స్టేష-న్‌తో పాటు సమీపంలోని ఇతర స్టేషన్లను కూడా మూసివేయడంతో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, వ్యాజ్యదారులు సుప్రీంకోర్టుకు చేరుకోలేకపోతున్నారని వివరించారు. ఈ సందర్భంగా సీజేఐ స్పందిస్తూ.. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల కారణంగా న్యాయవాదులు కోర్టుకు హాజరు కాలేకపోయినా... కేవలం ఆ కారణంతో ఏ కేసులోనూ ప్రతికూల ఉత్తర్వులు జారీ చేయొద్దని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. సుప్రీంకోర్టు మెట్రో స్టేషన్‌ను పూర్తిగా మూసివేయకుండా... న్యాయవాదులు, వ్యాజ్యదారులు, కోర్టు రిజిస్ట్రీ సిబ్బందికి మాత్రమే పరిమిత ప్రవేశం కల్పించాలని వికాస్ సింగ్ కోర్టును కోరారు. మెట్రో నుంచి బయటకు వచ్చే దగ్గర భద్రతా తనిఖీలు నిర్వహించి, సుప్రీంకోర్టు ప్రాక్సిమిటీ కార్డు లేదా అధికారిక గుర్తింపు కార్డు ఉన్నవారిని మా-త్రమే బయటకు అనుమతించాలని సూచించారు. ఈ ప్రతిపాదనపై స్పందించిన సీజేఐ.. ఢిల్లీ మెట్రో అధికారులతో సంప్రదించి ఈ అంశాన్ని పరిశీలించాలని ఇప్పటికే సుప్రీంకోర్టు పరిపాలన విభాగాన్ని ఆదేశించినట్లు తెలిపారు."ఈ ఉదయమే అధికారులకు సమాచారం ఇచ్చాను. వారు మెట్రో అధికారులతో చర్చిస్తున్నారు. ఇది ఒక సాధ్యమైన పరిష్కారంగా పరిశీలిస్తున్నారు. మధ్యాహ్నం వరకు సమస్య పరిష్కారమైతే మంచిదే. లేకపోతే నా జోక్యం అవసరమైతే నేను తప్పకుండా జోక్యం చేసుకుంటాను." అని సీజేఐ సూర్యకాంత్ తెలిపారు. దేశ రాజధానిలో కొనసాగుతున్న విద్యార్థుల నిరసనల నేపథ్యంలో ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ భద్రతా కారణాల దృష్ట్యా సుప్రీంకోర్టు మెట్రో స్టేషన్‌తో పాటు మొత్తం 16 మెట్రో స్టేషన్లను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు మూసివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

# వంగరలో విజ్ఞాన కేంద్రం

**భీమదేవరపల్లి,ఫ్లాష్ ఇండియా :** భారతరత్న, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వారసత్వాన్ని భావితరాలకు పరిచయం చేసే లక్ష్యంతో ఆయన స్వగ్రామం వంగరలో నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రం పనులు తుదిదశకు చేరుకున్నాయి. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం నిర్మాణ పనులను పరిశీలించి, నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా వేగంగా పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. మంత్రి విజ్ఞాన కేంద్రంలోని ఫొటో గ్యాలరీ, సైన్స్ మ్యూజియం, అంఫిథియేటర్, ఆడిటోరియం, ధ్యాన మందిరం, సందర్శకుల విభాగాలను పరిశీలించి పనుల పురోగతిపై ఆరా తీశారు. ప్రతి విభాగం పీవీ నరసింహారావు దూరదృష్టి, పరిపాలనా సామర్థ్యం, దేశ నిర్మాణంలో ఆయన పోషించిన చారిత్రక పాత్రను ప్రతిబింబించేలా తీర్చిదిద్దాలని సూచించారు.

**పీవీ జీవిత విశేషాలు ప్రతిబింబించేలా గ్యాలరీ...**

ఫొటో గ్యాలరీలో పీవీ బాల్యం నుంచి ప్రధానమంత్రి పదవి వరకు సాగిన జీవిత ప్రస్థానం, ఆర్థిక సంస్కరణలు, విదేశాంగ విధానంలో తీసుకొచ్చిన మార్పులు, బహుభాషా పాండిత్యం, దేశానికి అందించిన విశిష్ట సేవలను ప్రతిబింబించే అరుదైన చిత్రాలు, చారిత్రక పత్రాలు, జ్ఞాపకాలను మరింత సమగ్రంగా ప్రదర్శించే అంశంపై పీవీ కుమారులు ప్రభాకర్ రావు, రాజేశ్వర్ రావుతో మంత్రి చర్చించి పలు సూచనలు చేశారు.

**జాతీయ స్థాయి గుర్తింపు తీసుకొచ్చే కేంద్రం..**

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. పీవీ నరసింహారావు తెలంగాణకే కాకుండా దేశానికి దిశానిర్దేశం చేసిన మహానేత. ఆయన ఆలోచనలు, విలువలు, పరిపాలనా దక్షత, సంస్కరణల స్ఫూర్తిని యువతకు చేరవేసే శాశ్వత జ్ఞాన కేంద్రంగా వంగర విజ్ఞాన కేంద్రం నిలవాలి" అని అన్నారు. కేంద్రం చుట్టూ గార్డెన్ అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, విస్తృతంగా మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించామని తెలిపారు. విజ్ఞాన కేంద్రం ప్రారంభమైన తర్వాత వంగర జాతీయ స్థాయిలో విద్యా, చారిత్రక, పర్యాటక కేంద్రంగా మరింత గుర్తింపు పొందుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీవీ నరసింహారావు కుమారులు ప్రభాకర్ రావు, రాజేశ్వర్ రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జక్కుల అనిల్, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, అధికారులు, సీఐ పులి రమేష్, ఎస్సైలు దివ్య, రాజు, నాగేశ్వరరావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



# 108 దేశాలు, 12 వేల మంది పోటీదారులు..

**ఆంధ్రప్రదేశ్:** ఆంధ్రప్రదేశ్‌లోని ఓ సాధారణ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న పదో తరగతి విద్యార్థిని.. ఈ రోజు ప్రపంచ స్థాయి అంతరిక్ష పరిశోధన వైపు ముందడుగు వేసి సరికొత్త చరిత్ర సృష్టించింది. తూర్పు గోదావరి జిల్లా దవ-ళేశ్వరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లో చదువుతున్న 14 ఏళ్ల కందుల జెస్సీ, ప్రపంచంలోనే మొట్టమొదటి ఆల్-గర్ల్స్ గ్లోబల్ లూనార్ క్యూబ్‌శాట్ మిషన్ అయిన 'మిషన్ శక్తిశాట్' కు ఎంపికై వార్తల్లో నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా 108 దేశాల నుంచి దాదాపు 12,000 మంది బాలికలు పోటీ పడగా, భారత్ నుంచి ఎంపికైన కేవలం 20 మంది విద్యార్థినుల్లో జెస్సీ ఒకరిగా నిలవడమే కాకుండా, ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థినిగా రికార్డు సృష్టించింది. పాఠశాల ప్రయోగశాలలో చిగురించిన ఈ అసాధారణ ప్రయాణం వెనుక ఆమె ఫిజికల్ సైన్స్ టీచర్, అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జ్ మణిమాల కృషి ఎంతగానో ఉంది. సైన్స్ పట్ల జెస్సీకున్న తీవ్ర ఆసక్తిని, జిజ్ఞాసను గమనించిన మ-ణిమాల, గతేడాది ఆమెను ఈ ప్రోగ్రామ్‌లో నమోదు చేయించారు. పదో తరగతి సాధారణ సిలబస్‌కు ఎంతగానో భిన్నంగా ఉన్న ఈ కోర్సువర్క్ ఏమాత్రం సులభంగా సాగలేదు. ఇందులో శాటిలైట్ సిస్టమ్స్, ప్రొపల్షన్, థర్మోడైనమిక్స్, స్పేస్ టెక్నాలజీ వంటి సంక్లిష్టమైన అంశాలపై 21 మోడ్యూళ్ల ద్వారా దాదాపు 550 ఆన్‌లైన్ సెషన్లు ఉన్నాయి. స్కూల్ పాఠాల కంటే ఇవి చాలా అడ్వాన్స్‌డ్‌గా ఉండటంతో ప్రారంభంలో ఎన్నో విషయాలు అర్థం చేసుకోవడం కష్టంగా అనిపించినప్పటికీ, జెస్సీ ప్రతిరోజూ స్కూల్ పూర్తయిన తర్వాత క్రమం తప్పకుండా తరగతులకు హాజ-రవుతూ తన పట్టుదలను నిలుపుకుంది. ఈ సుదీర్ఘ అభ్యాసం తర్వాత జరిగిన ఆఖరి ఎంపిక ప్రక్రియ జెస్సీ జీవితాన్నే మలుపు తిప్పింది. శాస్త్రవేత్తలు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లతో జరిగిన గంటసేపటి ఆన్‌లైన్ ఇంటర్వ్యూతో పాటు, మిషన్ శక్తిశాట్ ప్రాముఖ్యత, STEM (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్) విద్య ఆవశ్యకతను వివరిస్తూ ఒక నిమిషం నిడివిగల వీడియోను రూపొందించాల్సి వచ్చింది. వీటన్నింటిలోనూ తన ప్రతిభను, ఆత్మవిశ్వాసాన్ని చాటుకున్న జెస్సీ, అంతర్జాతీయ వేదికపై భారత్ ప్రతిష్టను పెంచడమే కాకుండా, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వేలాది మంది గ్రామీణ విద్యార్థినులకు ఆదర్శంగా నిలిచింది.

## రాహుల్ నివాసంలో ఇండి కూటమి అత్యవసర సమావేశం..

**న్యూ ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ వేడి ఒక్కసారిగా రాజుకుంది. లోక్ సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నివాసంలో ఇండియా కూటమి అగ్రనేతలు, ఎంపీలు అత్యవసరంగా భేటీ అయ్యారు. ఈ భేటీకి ప్రియాంకగాంధీ సహా కాంగ్రెస్, లెఫ్ట్, ఆర్జేడీ, టీఎంసీ ఎంపీలు హాజరయ్యారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న రాజకీయ పరిణామాలు, సీజేపీ నిరసనలు, పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వాన్ని ఎండగట్టేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చిస్తున్నారు. వివిధ అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు, విపక్షాల ఐక్యతను చాటేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఉభయ సభల్లో అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహంపై ఎంపీలకు రాహుల్ గాంధీ దిశానిర్దేశం చేస్తున్నారు. సమావేశం అనంతరం ఇండి కూటమి నేతలంతా కలిసి మహాత్మా గాంధీ స్మారక స్థలి అయిన 'రాజ్ ఘాట్' ను సందర్శించే యోచనలో ఉన్నట్లు సమాచారం. తమ నిరసనను శాంతియు-తంగా తెలియజేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ నివాసం వెలుపల నేతల కోసం ముందస్తుగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. రాహుల్ నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించడంతో భద్రతను కట్టుదిట్టం చేశారు. భేటీ పూ-ర్తయిన వెంటనే కూటమి నేతలు ఉమ్మడిగా ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## తొలిరోజే భారత్‌కు పతకం ఖాయం



**న్యూ ఢిల్లీ:** కామన్వెల్త్ క్రీడల్లో భారత్ కు తొలిపతకం ఖాయమయింది. స్కాట్లాండ్ లోని గ్లాస్గో వేదికగా కామన్వెల్త్ గేమ్స్ 2026 ప్రారంభమవ్వగా.. తొలిరోజే భారత్ కు పతకం ఖాయవ-వ్వడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. బాక్సింగ్ లో ఉమెన్స్ 75 కేజీల విభాగంలో లవ్లీనా బొర్గో హెయిన్ నేరుగా సెమీ ఫైనల్స్ ను అర్హత సాధించింది. దీంతో ఆమె భారత్ కు కాంస్యాన్ని ఖాయం చేసింది. క్వార్టర్ ఫైనల్స్ లో ఐదుగురు బాక్సర్లే ఉండగా.. డ్రా తీశారు. ఇందులో లవ్లీనాకు బై లభించగా.. ఆమెతో పాటు మరో ఇద్దరు కూడా నేరుగా సెమీస్ కు ఎంపికయ్యారు. మిగిలిన ఇద్దరు ఒక క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడి సెమీ ఫైనల్ కు ఎంపిక కావలసి ఉంటుంది. జులై 31న జరిగే సెమీఫైనల్ లో తువాలుకు చెందిన టీకేబీపీ తాఫాకీతో.. లవ్లీనా తలపడనుంది. సెమీ ఫైనల్స్ లో లవ్లీనా గెలిస్తే.. సిల్వర్ లేదా గోల్డ్ మెడల్ రావడం ఖాయంగా కనిపిస్తోంది. కాగా.. అస్సాంకు చెందిన లవ్లీనా టోక్యో ఒలింపిక్స్ 2020లో కాంస్యం, 2023 ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ లో 75 కేజీల బాక్సింగ్ లో గోల్డ్ మెడల్, 2022 ఏషియన్ ఛాంపియన్ షిప్ లో గోల్డ్ మెడల్, 2023 ఆసియా గేమ్స్ లో సిల్వర్ మెడల్స్ సాధించింది.




ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

# ఆయనవన్నీ వేరే పార్టీలు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) ప్రక్రియ అయిపోయే వరకూ ఎమ్మెల్యేలను గ్రామాల్లోనే ఉండమని చెప్పానని.. ఎమ్మెల్యేలకు కావాలనే గట్టిగా చెప్పానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు(గురువారం) మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. 30 పర్సంటేజ్ కావాల్సి ఉందని.. ఆ పర్సంటేజ్ చాలా కీలకమన్నారు. సర్.. నాయకులకు సంబంధించింది కాదని, ప్రజలకు సంబంధించిందని స్పష్టం చేశారు. 'తెలిసీ తెలియక నాకు రెండు ఓట్లు ఉన్నాయని అంటున్నారని.. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోమని చెప్పండి. కలెక్టర్ అనుమతి తీసుకొని నా గ్రామంలో ఉన్న ఓటును కొడంగల్‌కు మార్చుకున్నాను. గతంలో కొడంగల్ ప్రాంతం కర్ణాటకలోని జిల్లాలో ఉండేది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు చేసినప్పుడు కొడంగల్ పాలమూరులోకి వచ్చిందని చెప్పారు.

**సర్ పట్ల జాగ్రత్తగా ఉండాల్సిందే..**

బీజేపీ కుట్రపూరితంగా ఓట్లను తొలగించే అవకాశముందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. గ్రామీణ ప్రాంతంలో అమాయకుల ఓట్లు పోయే అవకాశముందన్నారు. సర్ ఉద్దేశం ప్రక్షాళన అని.. కుట్ర పూరితంగా సర్‌ను వాడుతున్నారని ఆరోపించారు. సర్ పట్ల జాగ్రత్తగా ఉండాల్సిందే అని చెప్పుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు పోతే.. కాంగ్రెస్ ఓట్లు పోయినట్టే అని అన్నారు. అవగాహన లేకపోవడం, సరైన సమయంలో స్పందించకపోవడం వల్ల ఓట్లు పోయే అవకాశముందన్నారు. 'ఓటుహక్కు లేకపోతే పథకాలు పోతాయని.. ఓటు హక్కు లేకపోతే ఆధార్ పోతుంది. ఓటుహక్కు లేకపోతే గుర్తింపే ఉండదు... ఓటు హక్కు లేకపోతే సంక్షేమం రాదు' అని అన్నారు.

**మేం చెప్పిందే చేస్తున్నాం...**

బీజేపీలో అంతర్గత కలహాలు ఉన్నాయని రేవంత్ అన్నారు. బీజేపీ నాయకులకు ఒకరంటే ఒకరికి పడదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు ఎక్కడుంటాయో బీజేపీకి తెలుసని వెల్లడించారు. చిన్నచిన్న కారణాలతో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు 5 లక్షలు ఇవ్వాలని డిసైడ్ అయిందని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు.. బ్రోకర్లకు అమ్ముకొని దళారీ వ్యవస్థ తెచ్చారని మండిపడ్డారు. 'మేం ఏం చేస్తున్నామో అదే చెప్తున్నాం' అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

**గ్లోబరీనా తప్పదాలపై కేటీఆర్ క్షమాపణ చెప్పాలి**

గ్లోబరీనా కేటీఆర్ బినామీ సంస్థ అని సీఎం ఆరోపించారు. గ్లోబరీనా తప్పిదాల వల్ల 27 మంది చనిపోయారని.. ఆ సంస్థ పేరు మార్చుకొని CBSE పరీక్షల కాంట్రాక్టు పొందిందని వ్యాఖ్యానించారు. గ్లోబరీనా సంస్థ తప్పిదాలపై కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వీటి ఆధారంగానే నీట్ కుంభకోణం జరిగిందన్నారు. అమరవీరుల స్తూపం వద్ద కేటీఆర్ ముక్కు నేలకు రాయాలన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విషయంలో బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు.

**కేటీఆర్ బర్త్‌డేపై ఆసక్తికర వ్యాఖ్యలు**

కేటీఆర్ బర్త్ డే పై సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'కేటీఆర్ పుట్టిన రోజు దావత్ ఇస్తాడో అడగాలి. కేటీఆర్ ఇచ్చే దావత్ నేను తీసుకోలేనేమో. ఆయనవి అన్నీ వేరే పార్టీలు' అంటూ సెటైర్ విసిరారు. హరీశ్ గొప్పవాడైతే మంత్రి పదవి నుంచి ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. అతి తెలివి తేటలతో ఏదిపడితే అది మాట్లాడతానంటే నడవదని హరీశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు కన్నెపెల్లి పంపు హౌజ్ గురించి మాట్లాడుతున్నారని... మేడిగడ్డ గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. మేడిగడ్డ గురించి మాట్లాడితే ప్రజలు చెప్పుతో కొడతారని మండిపడ్డారు. మేడిగడ్డ కట్టింది, కూల్చింది బీఆర్ఎస్ వాళ్లే అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.



# వెనక్కి తగ్గే ఆలోచన లేదు..

**న్యూ ఢిల్లీ :** E-20 పెట్రోల్ విషయంలో దేశవ్యాప్తంగా వాహనదారుల్లో ఆందోళనలు వ్యక్తం అవుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో కీలక ప్రకటన చేసింది. దేశవ్యాప్తంగా అమలవుతున్న E-20 పెట్రోల్ పూర్తిగా సురక్షితమైనదని, పర్యావరణ హితమైనదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఇథనాల్ లేని 'ప్యూర్ పెట్రోల్'కు తిరిగి వెళ్లే ప్రతిపాదన లేదని స్పష్టం చేసింది. అలాగే ఇథనాల్ మిశ్రమాన్ని ప్రస్తుతం ఉన్న 20 శాతానికి మించి పెంచే నిర్ణయం కూడా తీసుకోలేదని కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ సహాయ మంత్రి సురేష్ గోపీ తాజాగా పార్లమెంట్‌లో వెల్లడించారు. ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చిన మంత్రి.. తక్కువ ప్రమాణాలకు తిరిగి వెళ్లడం కాకుండా, ఉన్నతమైన, మెరుగైన సాంకేతికత వైపు పయనించడమే ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు. పార్లమెంటులో సమర్పించిన గణాంకాల ప్రకారం, భారతదేశం 20 శాతం ఇథనాల్ మిశ్రమం లక్ష్యాన్ని నిర్దేశిత గడువు కంటే ఐదేళ్ల ముందే సాధించిందని పేర్కొన్నారు.

# నీట్ పేపర్ లీక్‌లో కాంగ్రెస్ వారే

## పరీక్ష రాసిన ఒక్క విద్యార్థి కూడా నీట్‌కు వ్యతిరేకంగా మాట్లాడలేదు: రామచందర్ రావు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ లో జెన్ జీ ఉద్యమం తరహాలో భారత్ లో అలజడి సృష్టించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నం చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఆరోపించారు. సీజేపీ ఆందోళనలకు కొన్ని బంగ్లాదేశ్ పార్టీలు సైతం మద్దతు పలుకుతున్నాయని ధ్వజమెత్తారు. నేపాల్ లో షేక్ హసీనా నివాసంపై ఎలా దాటికి పాల్పడ్డారో అదే తరహాలో ప్రధాని నరేంద్ర మోడీ నివాసం వద్దకు రాహుల్ గాంధీ ప్రయత్నించారని ఆరోపించారు. ఇవాళ నాంపల్లి బీజేపీ స్టేట్ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. సీజేపీ ఆందోళనల్లో ఖలిస్తానీ వేర్పాటు వాదులు చేరారని, ఇందిరా గాంధీని చంపిన ఖలిస్తానీలతో చేతులు కలపడానికి రాహుల్ గాంధీకి సిగ్గులేదా అని ప్రశ్నించారు.

**నీట్ పేపర్ లీక్‌లో కాంగ్రెస్ వారే:**

పరీక్ష రాసిన ఒక్క విద్యార్థి కూడా నీట్‌కు వ్యతిరేకంగా మాట్లాడలేదని, కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టడంతో ఎలాంటి వ్యతిరేకత లేదని అన్నారు. తెలంగాణలో నీట్‌లో చాలా మందికి మంచి ర్యాంకులు వచ్చాయన్నారు. పేపర్ లీక్ పై చట్టం వచ్చిందని నిందితులకు శిక్షతో పాటు రూ.కోటి జరిమానా విధించేలా చట్టం తెచ్చామన్నారు. అదే 2014కు ముందు పేపర్ లీక్ అయితే 420 కింద కేసు పెట్టి వదిలిపెట్టేవారని విమర్శించారు. వామపక్ష భావజాలం ఉన్న వారే కాక్రోచ్ జనతా పార్టీలో ఉన్నారని వారే జంతర్ మంతర్ వద్ద ఉన్నారని ఆరోపించారు. 2014 కు ముందు ఇండియా కూటమి పార్టీల ప్రభుత్వాల హాయంలో అనేక పేపర్ లీకులు జరిగాయని అప్పుడు మంత్రులు రాజీనామా చేశారా అని నిలదీశారు.

# ఢిల్లీలో ఆంక్షలు తీవ్రం..

**న్యూ ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో కొనసాగుతున్న విద్యార్థుల నిరసనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ భద్రతా చట్టం (National Security Act-NSA), 1980 కింద ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్‌కు నిర్బంధ అధికారాలను వినియోగించేందుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అనుమతి ఇచ్చింది. ఈ అధికారాలు 2026 జూలై 19 నుంచి అక్టోబర్ 18 వరకు మూడు నెలలపాటు అమల్లో ఉంటాయని కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఎన్ఎస్ఏ ప్రకారం ఎవరినైనా అధికారికంగా కేసు నమోదు చేయకుండానే 12 రోజుల నుంచి గరిష్ఠంగా 12 నెలల వరకు నిర్బంధంలో ఉంచే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఢిల్లీలోని జంతర్‌మంతర్ సహా పలు ప్రాంతాల్లో విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు నిరసనలు చేపడుతున్నారు. ఈ పరిస్థితుల్లోనే కేంద్రం ఎన్ఎస్ఏ అధికారాల పొడిగింపు ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఈ నిర్ణయానికి ప్రస్తుత నిరసనలతో ఎలాంటి సంబంధం లేదని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. ఢిల్లీ పోలీసుల ప్రకారం.. ఎన్ఎస్ఏ కింద కమిషనర్‌కు ఇచ్చే ఈ అధికారాలను ప్రతి మూడు నెలలకు ఒకసారి సాధారణంగా పొడిగిస్తుంటారు. ప్రస్తుత ఉత్తర్వులు కూడా జూలై 7, 2026న జారీ అయ్యాయని, అవి జూలై 19 నుంచి అక్టోబర్ 18 వరకు అమలులో ఉంటాయని తెలిపారు. విద్యార్థుల నిరసనలు ప్రారంభమయ్యే ముందే ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయని, ఈ సందర్భంగా ఎలాంటి ప్రత్యేక అభ్యర్థన చేయలేదని పోలీసులు వెల్లడించారు. ఇది కేవలం సాధారణ పరిపాలనా ప్రక్రియ మాత్రమేనని స్పష్టం చేశారు.

**మళ్లీ ఉద్రిక్తం**

ఇదిలా ఉండగా బుధవారం రాత్రి ఢిల్లీలోని జంతర్‌మంతర్, సంసద్ మార్గ్ ప్రాంతాల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ది పార్క్ హోటల్ సమీపంలో నిరసనకారులు, భద్రతా బలగాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ టియర్ గ్యాస్ ప్రయోగించారు. నిరసనకారులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేయడంతో పోలీసులు వారిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో కొందరు నిరసనకారులు రాళ్లు రువ్వడంతో పాటు కానాట్ ప్లేస్ వరకు పోలీసులను వెంబడించినట్లు అధికారులు తెలిపారు. ఘటనల నేపథ్యంలో సెంట్రల్ ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు.

**సీజేపీ ఉద్యమం ఎలా ప్రారంభమైంది?**

ప్రస్తుతం జరుగుతున్న ఈ ఉద్యమానికి కాక్రోచ్ జనతా పార్టీ (జజీపీ) నాయకత్వం వహిస్తోంది. బోస్టన్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి అభిజీత్ దిప్కే ఈ పార్టీని స్థాపించారు. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ చేసిన ఒక వ్యాఖ్య తర్వాత సోషల్ మీడియాలో వ్యంగ్య ప్రచారంగా ప్రారంభమైన ఈ ఉద్యమం.. తర్వాత ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షల్లో అవకతవకలకు వ్యతిరేకంగా యువజన ఉద్యమంగా మారింది. జూన్ 20 నుంచి జంతర్‌మంతర్‌లో సీజేపీ నిరసనలు కొనసాగుతున్నాయి. ప్రముఖ పర్యావరణ కార్యకర్త సోనం వాంగ్‌చుక్ కూడా ఈ ఉద్యమానికి బహిరంగ మద్దతు ప్రకటించి నిరసనల్లో పాల్గొంటున్నారు.

**సీజేపీకి కేంద్రం మరోసారి పిలుపు..**

కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నిరసనకారులతో చర్చలకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. బుధవారం నుంచి నాలుగు సార్లు ఆహ్వానం పంపింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం బుధవారం మధ్యాహ్నం నుంచి చర్చల కోసం నాలుగు అధికారి ప్రతిపాదనల్ని పంపిందని తెలిపారు. నిరసనకారులకు అనువైన సమయంలో, ఎప్పుడైనా అన్ని అంశాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ చర్చల్లో కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా కూడా పాల్గొంటారని వెల్లడించారు. జేపీ నడ్డా కార్యాలయంలో లేదా ఆయన నివాసంలో చర్చలు జరగొచ్చని, మాకు ప్రతిష్ఠ ముఖ్యం కాదని, జేపీ నడ్డా తాను ఇద్దరం చర్చలు జరుపుతామని జితేంద్ర సింగ్ అన్నారు. చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం దిశగా ముందుకు సాగుతామని, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న వరస చర్యల్లో ఇది ఒకటని చెప్పారు. అందరూ చర్చలకు రావాలని వినమ్రంగా కోరతున్నామని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే పేపర్ లీక్స్‌కు పాల్పడే వారిపై వేగంగా న్యాయంగా చర్యలు తీసుకునేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్రమోడీ గురువారం ప్రకటించారు. ఇదిలా ఉంటే, కేంద్ర ప్రభుత్వం చర్చలకు ఆహ్వానిస్తుంటే, తమ వద్దకే వచ్చి చర్చలు జరపాలని సీజేపీ నేత అభిజిత్ దీప్కే అన్నారు. జంతర్ మంతర్ వద్దకు కేంద్ర రావాలని అల్టిమేటం విధించారు. కేంద్రం డోర్స్ ఓపెన్ చేసి ఉన్నాయని చెబుతుందని, జంతర్ మంతర్ డోర్స్ కూడా ఓపెన్ చేసి ఉన్నాయని ఆయన అన్నారు. సీజేపీ అధికారిక ప్రతినిధి అశుతోష్ రాంకా మాట్లాడుతూ.. ప్రభుత్వంతో చర్చలు జరగాలంటే తటస్థ వేదికలో లేదా జంతర్ మంతర్ వద్ద జరగాలని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌పై వెనక్కి తగ్గమని స్పష్టం చేశారు.

**అలా చేస్తే పాస్‌పోర్టులు రద్దు!**

దేశ రాజధాని ఢిల్లీలో సీజేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళనలు ఉధృతం అవుతున్న నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు కఠిన నిర్ణయం తీసుకున్నారు. అల్లర్లకు పాల్పడినట్లు గుర్తించిన వ్యక్తులపై క్రిమినల్ కేసులతో పాటు వారి పాస్‌పోర్ట్ రద్దు ప్రక్రియను కూడా ప్రారంభించనున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. హింసాత్మక నిరసనల్లో పాల్గొన్న వారిపై చట్టపరమైన చర్యలతో పాటు పరిపాలనా పరమైన చర్యలు కూడా తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. గత సోమవారం సీజేపీ నిర్వహించిన 'చలో సంసద్' ర్యాలీలో నిరసనకారులు పార్లమెంట్ భద్రతా బారికేడ్లను దాటేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించడం, లాఠీచార్జ్ చేయడం, అల్లర్ల నియంత్రణ వాహనాలను వినియోగించడం జరిగింది. ఈ ఘటనల్లో పలువురు నిరసనకారులు, పోలీసు సిబ్బంది స్వల్పంగా గాయపడ్డారు. అదే సమయంలో తమ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సీజేపీ ఆరోపించింది.

**జూలై 24న దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపు**

ఇదిలా ఉండగా పోలీసుల చర్యలకు నిరసనగా జూలై 24న దేశవ్యాప్తంగా శాంతియుత నిరసనలు నిర్వహించాలని సీజేపీ పిలుపునిచ్చింది. ప్రతి జిల్లాలో విద్యార్థులపై జరిగిన పోలీసు దాడులను నిరసిస్తూ ఆందోళనలు చేపట్టాలని పార్టీ కోరింది. విద్యార్థి సంఘాలు, యువజన సంస్థలు స్థానికంగా సమన్వయం చేసుకుని విద్యార్థుల డిమాండ్లను ప్రజలకు వివరించాలని, పోలీసు చర్యలకు గురైన విద్యార్థులకు సంఘీభావం ప్రకటించాలని పార్టీ విజ్ఞప్తి చేసింది.

**ఆందోళనలకు పెరుగుతున్న మద్దతు**

ఇటీవల జంతర్‌మంతర్ దగ్గర పరిమిత స్థాయిలోనే నిరసనలు కొనసాగాయి. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. అయితే సోమవారం విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జ్ తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. బుధవారం నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత జంతర్‌మంతర్‌కు చేరుకుని నిరసనల్లో పాల్గొంటున్నారు. పోలీసుల లాఠీచార్జ్ వీడియోలు చూసిన తర్వాతే తాము ఉద్యమంలో చేరినట్లు పలువురు నిరసనకారులు తెలిపారు. పాల్గొంటున్న వారి సంఖ్యను అంచనా వేయడం కూడా కష్టంగా మారిందని సీజేపీ నిర్వాహకులు పేర్కొన్నారు. ఇక విద్యార్థుల ఉద్యమానికి దేశ వ్యాప్తంగా అనూహ్యంగా మద్దతు లభిస్తుంది. విపక్ష పార్టీలతో పాటు సినీ, క్రికెటర్ల నుంచి మద్దతు లభిస్తుంది. సినీనటులు ప్రత్యక్ష పోరాటంలో కూడా పాల్గొంటున్నారు.

**రాజకీయంగా వేడెక్కిన వివాదం**

విద్యార్థుల ఆందోళన రాజకీయంగానూ తీవ్ర చర్చకు దారితీసింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై విమర్శలు గుప్పించారు. నీట్ అంశంపై పార్లమెంట్‌లో చర్చకు ప్రభుత్వం అంగీకరించినప్పటికీ రాహుల్ గాంధీ తన మాట నిలబెట్టుకోలేదని ఆరోపించారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ మాత్రం నిరసనలను మరింత ఉధృతం చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధికారిక నివాసం 7, లోక్ కళ్యాణ్ మార్గ్ ఎదుట కాంగ్రెస్ ఎంపీలు, సీనియర్ నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో పాటు, నీట్ పేపర్ లీక్ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని, విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలపై స్వతంత్ర విచారణ చేపట్టాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా ఈ ఘటనకు బాధ్యత వహించాలని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు.




# హుస్నాబాద్ అభివృద్ధే ధ్యేయం

**హుస్నాబాద్,ఫ్లాష్ ఇండియా :** హుస్నాబాద్ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధి, రైతాంగ క్షేమం, ప్రజారోగ్యమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గురువారం హుస్నాబాద్‌లో నిర్వహించిన పలు కీలక ప్రభుత్వ, సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులకు, ప్రజాప్రతినిధులకు దిశా నిర్దేశం చేశారు. వర్షాభావ పరిస్థితుల పై ముగ్గురు జిల్లాల కలెక్టర్లతో ఉన్నత స్థాయి సమీక్ష ప్రకృతి వైపరీత్యమైన ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ఉపశమన చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు హైమావతి, చిత్రామిశ్రా, చాహత్ బజ్‌పాయ్‌లతో పాటు అదనపు కలెక్టర్లు, మూడు జిల్లాల వివిధ శాఖల ఉన్నతాధికారులతో అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో తాగునీటి ఎద్దడి, పశు గ్రాసం కొరత తలెత్తకుండా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఆరుతడి పంటలు, ఉద్యానవన రంగానికి సంబంధించి ఆయిల్ పామ్ సాగు వైపు రైతులను ప్రోత్సహించాలన్నారు. పడిపోతున్న భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని, 'విబిజిరాంజీ' పథకం కింద ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టి పడిన ప్రతి వర్షపు బొట్టునూ సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఆదర్శ నియోజకవర్గంగా హుస్నాబాద్ -- స్వయంగా ఎన్యూమరేషన్ ఫారం సమర్పణ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియపై బిఎల్ఏ లు, సూపర్‌వైజర్లు, పార్టీ ముఖ్య నాయకులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా స్వయంగా తన ఎన్యూమరేషన్ ఫారాన్ని పూరించి బిఎల్‌వోకు అందజేశారు. హుస్నాబాద్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ ఓటరు సవరణ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని, పట్టణంలో ఇప్పటికే 80 శాతం ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. ఆగస్టు 3వ తేదీ చివరి గడువు కావడం వల్ల, వలస వెళ్లిన కుటుంబాల వివరాలను సేకరించి అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు తొలగిపోకుండా ప్రతి వార్డులో ఇంటింటికి వెళ్లి జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని వరుణ యాగాలు, ప్రత్యేక పూజలు రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు, జలాశయాలు నిండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని కోరుతూ పట్టణంలోని పలు ఆలయాల్లో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ రేణుక ఎల్లమ్మ, శ్రీకృష్ణ దేవాలయాల్లో అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం అయ్యప్ప ఆలయంలో 108 మంది రుత్వికులతో నిర్వహించిన శ్రీ వారాహి మూల మంత్ర హోమంలో, మరకత శివాలయంలో 108 కలశాలతో జరిపిన వరుణ యాగంలో పాల్గొన్నారు. రైతు బాగుంటేనే సమాజంలోని వ్యాపారులు, కార్మికులు, చేతివృత్తులవారు సహా అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతాయని, ప్రతి ఒక్కరూ "సర్వేజనా సుఖినోభవంతు" భావనతో సమాజ శ్రేయస్సు కోసం ప్రార్థించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో SIR పీసీసీ కోఆర్డినేటర్ సౌజన్య గౌడ్, హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, బిఎల్ఏలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, వేద పండితులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సంపాదకీయం

## అవినీతి అంతమా...

# లేక వ్యవస్థకే అంతరాయమా?




ఒకప్పుడు అవినీతి అంటే ప్రభుత్వ కార్యాలయాల్లో చిన్నచిన్న లంచాలకే పరిమితమనే భావన ఉండేది. కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కోట్ల రూపాయల అక్రమాస్తులు, వందల ఎకరాల భూములు, బినామీ పెట్టుబడులు, విదేశీ ఆస్తులు, షెల్ కంపెనీలు, విలాసవంతమైన జీవనశైలి ఇవన్నీ సాధారణ వార్తలుగా మారిపోయాయి. తరచూ అవినీతి నిరోధక సంస్థలు నిర్వహిస్తున్న దాడుల్లో బయటపడుతున్న ఆస్తుల వివరాలు ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. అయితే ఈ సంఘటనలు కేవలం వ్యక్తిగత దురాశను మాత్రమే సూచించడం లేదు. అవి మన పరిపాలనా వ్యవస్థలోని లోతైన బలహీనతలను కూడా బయటపెడుతున్నాయి.ఇటీవలి కాలంలో వివిధ శాఖలకు చెందిన పలువురు ప్రభుత్వ అధికారులు అవినీతి ఆరోపణలతో విచారణను ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో భారీ మొత్తంలో నగదు, బంగారం, భూముల పత్రాలు, బినామీ పెట్టుబడులు బయటపడుతున్నాయి. ప్రతి కేసులో నిందితులు దోషులేనని కోర్టు తేల్చే వరకు వారిని దోషులుగా పరిగణించలేం. అయినప్పటికీ, ఇలాంటి కేసుల సంఖ్య పెరుగుతుండటం ప్రజల్లో ఒక సహజమైన ప్రశ్నను లేవనెత్తుతోంది వ్యవస్థలో నిజాయితీ కంటే అవినీతి సులభమైన మార్గంగా మారిందా?ప్రజాస్వామ్యంలో రాజకీయ నాయకులు విధానాలను రూపొందిస్తారు. అధికారులు వాటిని అమలు చేస్తారు. ఈ రెండింటి మధ్య పారదర్శకత, జవాబుదారీతనం లేకపోతే అవినీతికి ద్వారాలు తెరుచుకుంటాయి. రాజకీయ నాయకత్వం, అధికార యంత్రాంగం, కాంట్రాక్టు వ్యవస్థ, వ్యాపార ప్రయోజనాలు ఒకే వలయంలో తిరగడం ప్రారంభించినప్పుడు ప్రజాధనం క్రమంగా కొద్దిమంది చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది. ఈ పరిస్థితి కేవలం ఆర్థిక నష్టమే కాదు, ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసాన్ని కూడా దెబ్బతీస్తుంది.ప్రతి అవినీతి కేసు వెనుక ఒక సామాన్య పౌరుడి నష్టం దాగి ఉంటుంది. ఒక ప్రభుత్వ అధికారి లంచం తీసుకుంటే అది కేవలం చట్టవ్యతిరేక చర్య మాత్రమే కాదు; ఒక రైతుకు అందాల్సిన సాయం ఆలస్యం కావడం, ఒక పేద కుటుంబానికి ఇల్లు అందకపోవడం, ఒక రోగికి నాణ్యమైన వైద్యం అందకపోవడం, ఒక విద్యార్థికి అవకాశాలు కోల్పోవడం కూడా అవుతుంది. అందుకే అవినీతిని కేవలం ఆర్థిక నేరంగా కాకుండా సామాజిక అన్యాయంగా కూడా చూడాలి.తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో రాజకీయ నాయకులు, ఉన్నతాధికారుల ఆస్తుల పెరుగుదలపై ప్రజల్లో చర్చ జరుగుతోంది. ఎన్నికల అఫిడవిట్లు, దర్యాప్తు నివేదికలు, అవినీతి నిరోధక సంస్థల చర్యలు తరచూ వార్తల్లో నిలుస్తున్నాయి. అయితే ప్రజల్లో ఎక్కువగా వినిపిస్తున్న విమర్శ ఏమిటంటే, దాడులు జరుగుతున్నాయి... కానీ తుది శిక్షలు ఎంతమందికి పడుతున్నాయి? దర్యాప్తు ప్రారంభించడం ఒక దశ మాత్రమే. కేసులను వేగంగా పూర్తి చేయడం, న్యాయపరమైన విచారణను సమర్థవంతంగా నిర్వహించడం, దోషులకు శిక్ష పడేలా చేయడం అంతకంటే ముఖ్యమైనది.ఇక్కడ మరో ప్రశ్న కూడా తలెత్తుతోంది. అవినీతి నిరోధక సంస్థలు, ఆదాయపు పన్ను శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ వంటి సంస్థలు పూర్తిగా స్వతంత్రంగా పనిచేస్తున్నాయా? లేక రాజకీయ ప్రభావానికి గురవుతున్నాయా? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పడం ప్రభుత్వాల బాధ్యత. ఎందుకంటే దర్యాప్తు సంస్థల విశ్వసనీయత దెబ్బతింటే చట్టంపై ప్రజల నమ్మకం కూడా బలహీనపడుతుంది. అధికార పక్షానికైనా, ప్రతిపక్షానికైనా ఒకే చట్టం, ఒకే ప్రమాణం అమలవుతుందనే నమ్మకం ప్రజల్లో ఉండాలి.అవినీతికి మరో ప్రధాన కారణం శిక్ష భయం తగ్గిపోవడమే. కేసులు దశాబ్దాల పాటు కొనసాగడం, నిందితులు బెయిల్‌పై బయటకు రావడం, కొందరు తిరిగి పదవుల్లోకి చేరడం వంటి పరిణామాలు నిజాయితీగా పనిచేసే అధికారుల్లో నిరుత్సాహాన్ని, అవినీతిపరుల్లో ధైర్యాన్ని పెంచుతాయి. ఆలస్యమైన న్యాయం, చాలాసార్లు న్యాయం జరగనట్టే భావనను కలిగిస్తుంది.ఇది కేవలం చట్టాలతో పరిష్కరించగల సమస్య కాదు. పరిపాలనా సంస్కరణలు కూడా అవసరం. ప్రభుత్వ టెండర్లలో పూర్తి పారదర్శకత, అధికారుల ఆస్తుల వార్షిక ప్రకటనలు, డిజిటల్ సేవల విస్తరణ, పౌరులకు సమాచార హక్కు అమలును బలోపేతం చేయడం, అంతర్గత విజిలెన్స్ వ్యవస్థలను ఆధునీకరించడం వంటి చర్యలు అవినీతి అవకాశాలను తగ్గించగలవు. అలాగే నిజాయితీగా పనిచేసే అధికారులకు రక్షణ, ప్రోత్సాహం కూడా సమానంగా అవసరం.అవినీతి గురించి మాట్లాడేటప్పుడు రాజకీయ నాయకులను మాత్రమే విమర్శించడం సరిపోదు. సమాజం కూడా తన పాత్రను పరిశీలించుకోవాలి. లంచం ఇచ్చి పని త్వరగా పూర్తిచేయించుకోవాలని ప్రయత్నించే పౌరుడు కూడా ఈ వ్యవస్థలో భాగమే. ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం, తాత్కాలిక ప్రలోభాలను అంగీకరించే ఓటరు కూడా పరోక్షంగా అవినీతి రాజకీయాలకు బలం చేకూరుస్తాడు. అవినీతి ఒక వ్యక్తి వల్ల పుట్టదు; అది వ్యవస్థ, రాజకీయాలు, సమాజం కలిసి సహించడంతో పెరుగుతుంది.భారత రాజ్యాంగం ప్రభుత్వానికి అధికారం ఇచ్చింది. అదే సమయంలో ప్రజాధనాన్ని కాపాడే బాధ్యతను కూడా అప్పగించింది. పన్నుల రూపంలో ప్రజలు చెల్లించే ప్రతి రూపాయి అభివృద్ధికి ఉపయోగపడాలి. అది కొద్దిమంది అక్రమ సంపదగా మారితే నష్టపోయేది ప్రభుత్వ ఖజానా మాత్రమే కాదు భవిష్యత్ తరాల అవకాశాలు కూడా.నేడు అవసరమైనది సంచలనాత్మక దాడులు కాదు; స్థిరమైన సంస్కరణలు. పెద్ద పెద్ద ప్రకటనలు కాదు; నిరూపితమైన చర్యలు. ఒక ప్రభుత్వం వచ్చినప్పుడు ఒక విధానం, మరొక ప్రభుత్వం వచ్చినప్పుడు మరో విధానం కాకుండా, రాజకీయాలకు అతీతంగా అవినీతి నిరోధక వ్యవస్థలను బలోపేతం చేయాలి. దర్యాప్తు సంస్థలకు స్వతంత్రత, న్యాయవ్యవస్థకు వేగం, పరిపాలనకు పారదర్శకత, ప్రజలకు సమాచార హక్కు ఈ నాలుగు స్తంభాలపై మాత్రమే అవినీతిపై నిజమైన పోరాటం నిలబడుతుంది.చివరగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే. అవినీతి వల్ల కోల్పోయేది కేవలం డబ్బు కాదు; ప్రజల విశ్వాసం. ఆ విశ్వాసం కూలిపోతే ప్రజాస్వామ్యానికి పునాదులే బలహీనపడతాయి. అందుకే అవినీతిపై పోరాటం రాజకీయ నినాదం కాకూడదు. అది దేశ నిర్మాణానికి అవసరమైన నిరంతర ప్రక్రియ కావాలి. చట్టం ముందు ప్రతి ఒక్కరూ సమానమనే సూత్రం మాటల్లో కాదు, చేతల్లో కనిపించిన రోజే ప్రజలకు వ్యవస్థపై మళ్లీ విశ్వాసం కలుగుతుంది.




# ప్రశ్నార్థకంగా మారిన యువత భవిష్యత్తు

దేశ భవిష్యత్తును నిర్మించే శక్తి యువతది. ఆ యువతకు విద్య అనేది కేవలం ఉద్యోగం సాధించే సాధనం మాత్రమే కాదు; అది వారి కలలకు, కుటుంబాల ఆశలకు, సమాజ పురోగతికి పునాది. ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు తమ జీవితంలోని అత్యంత విలువైన సమయాన్ని వైద్య విద్యలో ప్రవేశం కోసం నిర్వహించే నీట్ పరీక్షకు అంకితం చేస్తారు. ఎన్నో త్యాగాలు, ఎన్నో ఆశలు, ఎన్నో ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ వారు ఈ పరీక్షకు సిద్ధమవుతారు. అలాంటి పరీక్షలో పారదర్శకతపై సందేహాలు తలెత్తడం, ప్రశ్నాపత్ర లీక్ ఆరోపణలు వెలుగులోకి రావడం, విద్యార్థులు వీధుల్లోకి వచ్చి న్యాయం కోరడం వంటి పరిణామాలు కేవలం ఒక పరీక్షకు సంబంధించిన సంఘటనలు కావు. అవి భారత విద్యా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని సవాలు చేసే పరిణామాలు.పరీక్ష అంటే ప్రతిభకు గౌరవం ఇవ్వడం. కష్టపడి చదివిన వారికి సమాన అవకాశాలు కల్పించడం. కానీ పరీక్షా వ్యవస్థలో అక్రమాలు చోటుచేసుకున్నాయనే భావన ఏర్పడితే, మొదట దెబ్బతినేది ప్రతిభపై ఉన్న విశ్వాసం. ఒక విద్యార్థి సంవత్సరాల పాటు శ్రమించి, చివరకు ఎవరో అక్రమ మార్గంలో ప్రయోజనం పొందారని భావిస్తే, అతని మనోధైర్యం ఎంతగా దెబ్బతింటుందో ఊహించడం కష్టం కాదు. ఈ బాధను అర్థం చేసుకోకుండా కేవలం పరిపాలనా చర్యలతో సమస్య ముగిసిపోయిందని భావించడం సరైన దారి కాదు.ఇటీవలి కాలంలో నీట్ పరీక్షకు సంబంధించి వచ్చిన వివాదాలు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీశాయి. వివిధ రాష్ట్రాల్లో ప్రశ్నాపత్ర లీక్ ఆరోపణలు, దర్యాప్తు సంస్థల జోక్యం, నిందితుల అరెస్టులు, కోర్టుల్లో విచారణలు ఇవన్నీ ప్రజల దృష్టిని ఆకర్షించాయి. దీనితో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు పరీక్షా వ్యవస్థలో మరింత పారదర్శకతను కోరుతూ స్వరం వినిపించారు. ఇది ప్రజాస్వామ్య సమాజంలో సహజమైన పరిణామం. ఎందుకంటే విద్య అనేది వ్యక్తిగత అంశం మాత్రమే కాదు; అది దేశ నిర్మాణానికి సంబంధించిన అంశం.వైద్య విద్యలో ప్రవేశం పొందేందుకు ప్రతి సంవత్సరం లక్షలాది మంది పోటీ పడుతున్నారు. వారిలో చాలా మంది మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారు. కుటుంబ సభ్యులు అప్పులు చేసి కోచింగ్ ఫీజులు చెల్లించడం, విద్యార్థులు సామాజిక జీవితాన్ని పక్కనపెట్టి రోజుకు పది నుంచి పన్నెండు గంటల పాటు చదవడం సాధారణ విషయాలుగా మారాయి. ఈ కఠినమైన ప్రయాణం చివర్లో జరిగే పరీక్షపై విశ్వాసం లేకపోతే, వారి శ్రమకు అర్థమేంటనే ప్రశ్న తలెత్తుతుంది.అయితే మరోవైపు, దేశవ్యాప్తంగా ఒకే ప్రమాణంతో వైద్య విద్యార్థులను ఎంపిక చేయాలనే ఉద్దేశంతో నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షను ప్రవేశపెట్టారు. వివిధ రాష్ట్రాల్లో వేర్వేరు ప్రవేశ పరీక్షలు ఉండటం వల్ల ఏర్పడే అసమానతలను తగ్గించాలన్నది దీని లక్ష్యం. అనేక మంది విద్యార్థులకు ఇది సమాన అవకాశాలను కూడా కల్పించింది. అందువల్ల సమస్య పరీక్ష అనే భావనలో లేదు; పరీక్ష నిర్వహణలో పారదర్శకత, భద్రత, విశ్వసనీయత నిరంతరం బలోపేతం కావాల్సిన అవసరంలో ఉంది.యువత వీధుల్లోకి వచ్చి నిరసనలు వ్యక్తం చేయడం ఒక హెచ్చరికగా చూడాలి. వారు కేవలం ఒక పరీక్షను రద్దు చేయాలని మాత్రమే కోరుకోవడం కాదు. వారి కష్టానికి విలువ ఉండాలని, నిజాయితీగా చదివిన వారికి అన్యాయం జరగకూడదని, ప్రభుత్వ సంస్థలపై ప్రజల విశ్వాసం నిలబెట్టాలని కోరుతున్నారు. ఈ స్వరాన్ని రాజకీయ కోణంలో కాకుండా సామాజిక బాధ్యత కోణంలో చూడాల్సిన అవసరం ఉంది.ప్రజాస్వామ్యంలో నిరసన హక్కు రాజ్యాంగబద్ధమైనది. అయితే ప్రతి నిరసన శాంతియుతంగా, చట్టబద్ధంగా సాగడం కూడా అంతే ముఖ్యం. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడం, హింసకు పాల్పడటం వంటి చర్యలు ప్రజా ఉద్యమాల నైతిక బలాన్ని బలహీనపరుస్తాయి. అదే సమయంలో, శాంతియుతంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్న విద్యార్థుల స్వరాన్ని ప్రభుత్వం వినడం కూడా ప్రజాస్వామ్య బాధ్యతలో భాగమే. ప్రజాస్వామ్యం అనేది కేవలం ఎన్నికలతో ముగిసిపోయే వ్యవస్థ కాదు; ప్రజల ఆందోళనలకు స్పందించే వ్యవస్థ.ప్రభుత్వం ఇప్పటికే దర్యాప్తు చర్యలు ప్రారంభించింది. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడం అవసరం. కానీ ప్రజలు ఆశించేది అంతకంటే ఎక్కువ. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చేసే వ్యవస్థాపరమైన సంస్కరణలు అవసరం. ప్రశ్నాపత్రాల భద్రతలో ఆధునిక సాంకేతికత వినియోగం, డిజిటల్ ట్రాకింగ్, పరీక్షా కేంద్రాల పర్యవేక్షణ, బాధ్యులపై వేగవంతమైన చర్యలు, పారదర్శక సమాచార వ్యవస్థ ఇవి అన్నీ సమగ్రంగా అమలు కావాలి.ఇక కోచింగ్ వ్యవస్థ గురించి కూడా సమాజం ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ప్రస్తుతం వైద్య విద్యలో ప్రవేశం కోసం కోచింగ్ ఒక భారీ పరిశ్రమగా మారింది. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన యువతకు సమాన అవకాశాలు కల్పించాలంటే ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. పాఠశాల విద్యనే పోటీ పరీక్షలకు అనుగుణంగా తీర్చిదిద్దగలిగితే, ఖరీదైన కోచింగ్‌పై ఆధారపడాల్సిన పరిస్థితి కొంతవరకు తగ్గుతుంది.విద్య అనేది విశ్వాసంపై నిలబడే వ్యవస్థ. ఒకసారి ఆ విశ్వాసం దెబ్బతింటే దానిని తిరిగి నిర్మించడం చాలా కష్టం. అందుకే ప్రతి పరీక్ష అనంతరం ఫలితాలు ప్రకటించడం మాత్రమే ప్రభుత్వ బాధ్యత కాదు. పరీక్షల నిర్వహణపై ప్రజల్లో నమ్మకం కల్పించడం కూడా అంతే ముఖ్యమైనది. పారదర్శకత అనేది ప్రకటనల్లో కాదు; ఆచరణలో కనిపించాలి.ఈ సందర్భంలో రాజకీయ పక్షాల పాత్ర కూడా బాధ్యతాయుతంగా ఉండాలి. విద్యార్థుల సమస్యలను రాజకీయ లాభనష్టాల కోణంలో కాకుండా, జాతీయ ప్రయోజనాల కోణంలో చూడాలి. పార్లమెంట్ నుంచి రాష్ట్ర శాసనసభల వరకు విద్యా సంస్కరణలపై విస్తృత చర్చ జరగాలి. అధికార పక్షం, ప్రతిపక్షం కలిసి విద్యార్థుల భవిష్యత్తు కోసం దీర్ఘకాలిక విధానాలను రూపొందించాలి. ఎందుకంటే ప్రభుత్వాలు మారవచ్చు, కానీ విద్యా వ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతింటే దాని ప్రభావం తరాల పాటు ఉంటుంది.ఈ వివాదం మరో ముఖ్యమైన విషయాన్ని కూడా గుర్తు చేస్తోంది. మన దేశంలో పరీక్షల ఒత్తిడి ఇప్పటికే తీవ్రంగా ఉంది. మంచి మార్కులు, ర్యాంకులు, ప్రవేశాలు ఇవన్నీ విద్యార్థులపై మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయి. ఇలాంటి సమయంలో పరీక్షల విశ్వసనీయతపై సందేహాలు రావడం ఆ ఒత్తిడిని మరింత పెంచుతుంది. కాబట్టి విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. కౌన్సెలింగ్, మార్గదర్శక సేవలు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అవసరం.భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశం. ఈ యువశక్తి మన గొప్ప సంపద. ఈ సంపదను కాపాడుకోవాలంటే ప్రతిభకు న్యాయం జరిగే వ్యవస్థ ఉండాలి. నిజాయితీగా కష్టపడిన విద్యార్థి ఎలాంటి అనుమానాలు లేకుండా పరీక్ష రాయగలగాలి. ఫలితాలు వచ్చిన తర్వాత తన విజయం లేదా అపజయాన్ని తన శ్రమ ఆధారంగానే అంగీకరించగలగాలి. అదే నిజమైన న్యాయం.నేటి యువత సోషల్ మీడియా ద్వారా వేగంగా స్పందిస్తోంది. వారి ప్రశ్నలు కూడా వేగంగా సమాజానికి చేరుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు మరింత పారదర్శకంగా, మరింత వేగంగా, మరింత బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. అధికారిక సమాచారం సమయానికి అందుబాటులో ఉండాలి. అపోహలకు తావు లేకుండా కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేయాలి.విద్యా వ్యవస్థపై విశ్వాసం కోల్పోతే దేశ అభివృద్ధి కూడా దెబ్బతింటుంది. వైద్యులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, పరిపాలనా అధికారులు అందరూ ఒకప్పుడు విద్యార్థులే. వారి ఎంపిక ప్రక్రియపై ప్రజలకు నమ్మకం ఉండాలి. ఆ నమ్మకమే సమాజంలో నాణ్యతకు పునాది.అందుకే నీట్ వివాదాన్ని కేవలం ఒక సంఘటనగా చూడకూడదు. ఇది భారత విద్యా వ్యవస్థకు ఒక హెచ్చరిక. లోపాలను గుర్తించి సరిదిద్దుకోవడానికి ఇది ఒక అవకాశం కూడా. దర్యాప్తు పూర్తి కావాలి. తప్పు చేసినవారు చట్టం ముందు నిలవాలి. నిర్దోషులకు న్యాయం జరగాలి. అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్ఠమైన సంస్కరణలు అమలు కావాలి.చివరగా ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రతి విద్యార్థి వెనుక ఒక కుటుంబం ఉంటుంది. ప్రతి ర్యాంకు వెనుక ఎన్నో నిద్రలేని రాత్రులు ఉంటాయి. ప్రతి విజయానికి వెనుక అనేక త్యాగాలు ఉంటాయి. అలాంటి యువతకు దేశం ఇవ్వాల్సింది అనుమానాలు కాదు ఆత్మవిశ్వాసం. అనిశ్చితి కాదు న్యాయం. అవిశ్వాసం కాదు పారదర్శకత.

**నీట్ వివాదం చివరికి మనందరికీ ఒకే ప్రశ్న వేస్తోంది:**

**మన దేశంలో ప్రతిభ గెలుస్తుందా, లేక వ్యవస్థలోని లోపాలా? ఆ ప్రశ్నకు సమాధానం ప్రభుత్వాలు మాత్రమే కాదు, మొత్తం సమాజం కలిసి ఇవ్వాలి. ఎందుకంటే విద్యార్థుల భవిష్యత్తును కాపాడటం అంటే భారతదేశ భవిష్యత్తును కాపాడటమే.**

# ఖాళీగా వదిలేశారు!

**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** ఖమ్మంలో అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది. అప్పట్లో అధికారంలో ఉన్నవారు కూడా తమకు నచ్చిన కాంట్రాక్టర్లకు లబ్ది చేకూర్చేందుకు సహకరించడంతో కోట్ల రూపాయలు దుర్వినియోగం అయినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇందుకు పలు దృష్టాంతాలు కండ్ల ముందు కనపడుతున్నాయి.

**రూ.50 లక్షల వ్యయంతో నిర్మించినా..**

ఖమ్మం నగరంలోని 9వ డివిజన్ పరిధిలోని రోటరీ నగర్‌లో వీధి వ్యాపారుల కోసం ఒక ప్రాంగాణాన్ని నిర్మించారు. ఈ నిర్మాణం కోసం ఏకంగా రూ.50లక్షలు ఖర్చు చేశారు. రోటరీ నగర్ రద్దీ ప్రాంతం కావడంతో కూరగాయల వ్యాపారాలు బాగా సాగుతాయని అధికారులు భావించారు. వీధి వ్యాపారుల ప్రాంగణంలో వ్యాపారస్తులకు దుకాణాలు కేటాయించారు. ఇక్కడ ఉత్సాహంగా వ్యాపారం ప్రారంభించిన వ్యాపారులు తర్వాత కొనుగోళ్లు మందగించడంతో ఒక్కొక్కరుగా తమ దుకాణాలను మూసివేశారు. వీధి వ్యాపారులు అందరు వెళ్లిపోవడంతో రూ.50లక్షలు ఖర్చుతో ఏర్పాటు చేసిన ప్రాంగణం ప్రస్తుతం ఖాళీగా ఉంది. లక్షల రూపాయలు వృధా అయ్యాయి. ఖాళీగా ఉన్న ఈ ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది.

**రూ. 4.50 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మాణం..**

ఖమ్మం నగరంలోని వీడివోస్ కాలనీలో సుమారు ఐదు కోట్ల రూపాయల వ్యయంతో సమీకృత వెజ్ అండ్ నాన్ వెజ్ ఆధునిక మార్కెట్‌ను నిర్మించారు. ఇక్కడ నాన్ వెజ్ మార్కెట్ నడవక మూత పడింది ఈ పరిస్థితిని చూసినప్పటికీ ఇల్లందు రోడ్‌లో ఖానాపురం సమీపంలో రూ.4.50కోట్ల వ్యయంతో మరో సమీకృత ఆధునిక మార్కెట్ నిర్మాణం చేపట్టారు. కొంత నిర్మాణం పూర్తి చేసిన తర్వాత నిధులు ఇంకా ఎక్కువ కావాలని నిర్మాణాన్ని ఆఫ్ చేశారు. అది అలాగే ఉంది. కొందరి అనాలోచిత చర్యలతో ప్రజాధనం వృధా అవుతున్నదనే విమర్శలు వస్తున్నాయి.ఇల్లందు రోడ్‌లోని సమీకృత వెజ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణ అంచనా వ్యయం పెరగటంతో అదనపు నిధుల మంజూరుకు ప్రభుత్వానికి లేఖ రాశామని ఇంజనీరింగ్ అధికారులు ఈఈ క్రిష్ణాలాల్ తెలిపారు. నిధులు రాగానే నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. రోటరీ నగర్‌లోని వీధి వ్యాపార మార్కెట్లో వ్యాపారాలు చేసేందుకు కూరగాయల వ్యాపారులు సుముఖంగా లేరని సదరు నిర్మాణాన్ని వేరే పనికి వినియోగిస్తామన్నారు.

# మోదీ,రాహుల్ ట్వీట్ వార్

**న్యూ ఢిల్లీ :** దేశంలోని నిరుద్యోగ యువత, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేస్తూ కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. వరుస పేపర్ లీకేజీ ఘటనలపై ఉక్కుపాదం మోపేందుకు, నిందితులకు త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా చేసేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని ప్రధాని మోడీ 'X' వేదికగా ప్రకటించారు. ఈ మేరకు సంబంధిత శాఖలు, అధికారులకు తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.

**ఫాస్ట్‌ట్రాక్ కోర్టులతో శరవేగంగా న్యాయం..**

అయితే, పేపర్ లీకేజీలకు పాల్పడి లక్షలాది మంది విద్యార్థుల కష్టాన్ని, వారి భవిష్యత్తును నాశనం చేస్తున్న క్రిమినల్ ముఠాలకు త్వరగా శిక్ష పడేలా చేయడం ద్వారా భవిష్యత్తులో ఇటువంటి చర్యలకు ఎవరూ పాల్పడకుండా అడ్డుకట్ట వేయవచ్చని కేంద్రం భావిస్తోంది. ఈ నిర్ణయం విద్యార్థుల హక్కులు, ప్రయోజనాలను రక్షించే దిశగా తీసుకుంటున్న కీలక అడుగుగా వెల్లడించారు. ఈ క్రమంలోనే దేశ యువత సంక్షేమం, వారి భవిష్యత్తు కంటే మాకు ఏదీ ఎక్కువ కాదని ప్రధాని మోడీ 'X' (ట్విట్టర్) వేదికగా ట్వీట్ చేశారు. విద్యార్థుల జీవితాలు, భవిష్యత్తుతో ఆడుకునే వారిని ఎంతటి వారైనా సరే ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని అన్నారు. వారికి చట్టపరంగా కఠినమైన శిక్ష అమలయ్యేలా చూస్తామని ప్రధాని మోడీ భరోసానిచ్చారు.

**యువత భవిష్యత్‌ను దెబ్బ తీసిందే మీరు.. మోడీకి రాహుల్ ఘాటు రిప్లై**

దేశంలోని యువత, విద్యార్థుల ప్రయోజనాలు కాపాడటమే తమ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అంటూ ప్రధాని మోడీ చేసిన ట్వీట్ పై రాహుల్ గాంధీ స్పందించారు. దేశ యువత భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీసేందే మీరు అంటూ ఘాటు రిప్లై ఇచ్చారు. విద్యావ్యవస్థను పూర్తిగా గుప్పిట్లో పెట్టుకుని నాశనం చేసేలా అనుమతి ఇచ్చారని, వారిని ప్రోత్సహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా బాధ్యులైన ప్రతి ఒక్కరినీ మీరే కాపాడారంటూ ఆరోపించారు. విద్యార్థుల డిమాడ్లు స్పష్టంగా ఉన్నాయని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాని రాజీనామా చేయాలన్నారు. విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని, వారిపై దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని మరోసారి రాహుల్ మూడు డిమాండ్లను మోడీ ముందు పెట్టారు. ఇదిలా ఉంటే మోడీ చేసిన ట్వీట్‌లో కేవలం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి నిందితులకు వెంటనే శిక్ష పడేలా చూస్తామని మాత్రమే హామీ ఇచ్చారు. కానీ విద్యార్థులు చేస్తున్న నిరసనలో స్పష్టంగా పేపర్ లీక్ ఘటనకు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే కేంద్రం మాత్రం ఈ విషయంలో వెనక్కి తగ్గడంలేదు. మరోవైపు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనకు మద్దతు పెరుగుతోంది.

# భారత్‌లో అంతర్భాగమే..

## పాకిస్థాన్‌కు భారత్ స్ట్రాంగ్ కౌంటర్..

**న్యూయార్క్:** ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వేదికగా పాకిస్థాన్‌కు భారత్ మరోసారి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. జమ్మూకశ్మీర్ అంశంలో భారత్‌పై పాక్ తప్పుడు ప్రచారం చేస్తూ అంతర్జాతీయ వేదికలను దుర్వినియోగం చేస్తోందని మండిపడింది. జమ్మూకశ్మీర్ ఎప్పటికీ భారతదేశంలో అంతర్భాగమేనని మరోసారి స్పష్టం చేసింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో 'సహజ వనరుల పరిపాలన: శాంతి, భద్రత, అభివృద్ధికి పునాది' అనే అంశంపై ఉన్నతస్థాయి బహిరంగ చర్చ జరిగింది. ఈ చర్చలో పాల్గొన్న భారత శాశ్వత ప్రతినిధి రాయబారి పర్వతనేని హరీశ్.. పాకిస్థాన్‌కు కౌంటర్ ఇస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

**యూఎన్ వేదికను దుర్వినియోగం చేస్తోంది: భారత్**

చర్చ సందర్భంగా పాకిస్థాన్ ప్రతినిధి చేసిన వ్యాఖ్యలకు స్పందించిన పర్వతనేని హరీశ్.. ఈ సమావేశంలో ద్వైపాక్షిక అంశాలను ప్రస్తావించే ఉద్దేశం తమకు లేదన్నారు. అయితే భారత్‌పై తప్పుడు కథనాన్ని ప్రచారం చేయడానికి పాకిస్థాన్ ఈ వేదికను దుర్వినియోగం చేయడంతో స్పందించాల్సి వచ్చిందని తెలిపారు. జమ్మూకశ్మీర్ విషయంలో రాజ్యాంగపరంగా, చట్టపరంగా ఎలాంటి సందేహాలకు తావులేదని స్పష్టం చేశారు. 'జమ్మూకశ్మీర్ ఎప్పటికీ భారతదేశంలో అంతర్భాగమే. ఇది రాజ్యాంగబద్ధమైన, చట్టబద్ధమైన వాస్తవం. పాకిస్థాన్ కావాలనే ఈ నిజాన్ని విస్మరిస్తోంది' అని పేర్కొన్నారు.

**అసలు సమస్య పాక్ ఆక్రమణే..**

జమ్మూకశ్మీర్‌కు సంబంధించి ఇంకా పరిష్కారం కావాల్సిన అంశం ఒక్కటే ఉందని పర్వతనేని హరీశ్ పేర్కొన్నారు. భారత సార్వభౌమ భూభాగాన్ని పాకిస్థాన్ ఆక్రమించడమే అసలు సమస్యని స్పష్టం చేశారు. 'జమ్మూకశ్మీర్ విషయంలో మిగిలి ఉన్న ఏకైక సమస్య భారత భూభాగంపై పాకిస్థాన్ చేసిన బహిరంగ దురాక్రమణ, అక్రమ ఆక్రమణ మాత్రమే' అని ఆయన తేల్చి చెప్పారు.

**సింధు జలాల ఒప్పందంపైనా స్పష్టత..**

సింధు జలాల ఒప్పందం అంశంపైనా భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. పరస్పర విశ్వాసం ఉన్నప్పుడే




సహకారం సాధ్యమవుతుందని, ఒకవైపు సరిహద్దు దాటి ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, మరోవైపు సహకారం ఆశించడం సాధ్యం కాదని పర్వతనేని హరీశ్ పేర్కొన్నారు.

**ముందు మీ దేశాన్ని చక్కదిద్దుకోండి..**

చివరగా పాకిస్థాన్‌కు భారత ప్రతినిధి ఘాటు సూచన చేశారు. భారత్‌పై అంతర్జాతీయ వేదికలపైన నిరాధార ఆరోపణలు చేయడం కంటే ముందు తమ దేశంలోని సమస్యలను పరిష్కరించుకోవాలని హితవు పలికారు. 'భారత్‌ను వేలెత్తి చూపే ముందు పాకిస్థాన్ తన ఇంటిని తాను చక్కదిద్దుకుంటే ఆ దేశానికీ, అక్కడి ప్రజలకూ ఎంతో మేలు జరుగుతుంది' అని పర్వతనేని హరీశ్ స్పష్టం చేశారు.

# నిర్మాత బండ్ల గణేశ్‌కు ఎదురుదెబ్బ..



**న్యూ ఢిల్లీ :** ప్రముఖ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ కు అత్యున్నత న్యాయస్థానంలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తన స్థిరాస్తిని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వేలం వేయడాన్ని సమర్థిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. వివరాల్లోకి వెళితే.. తన వ్యాపార రుణాలకు సంబంధించి జూబ్లీహిల్స్‌లోని స్థిరాస్తిని యూనియన్ బ్యాంక్ వేలం వేయడాన్ని సవాలు చేస్తూ బండ్ల గణేశ్ గతంలో న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ వ్యవహారంలో బ్యాంక్ చేపట్టిన వేలం సరైనదేనని, ఇందులో జోక్యం చేసుకోలేమని పేర్కొంటూ తెలంగాణ హైకోర్టు ఇటీవల యూనియన్ బ్యాంక్‌కు అనుకూలంగా తీర్పు వెలువరించింది.అయితే, హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పును సవాలు చేస్తూ బండ్ల గణేశ్ ఇటీవల సుప్రీంకోర్టు లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇవాళ విచారణ జరిపిన సుప్రీంకోర్టు బ్యాంక్ ఆస్తి వేలం వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. హైకోర్టు తీర్పును సమర్థిస్తూ, బండ్ల గణేశ్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లుగా తీర్పును వెలువరించింది. స్పష్టం చేసింది.

# గన్‌తో కాల్చుకుని కానిస్టేబుల్ సూసైడ్

**డీజీపీ కార్యాలయంలో తుపాకితో కాల్చుకుని కానిస్టేబుల్ ఆత్మహత్య.!**

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ డీజీపీ కార్యాలయంలో ఇవాళ ఉదయం సంచలనం చోటుచేసుకుంది. సర్వీస్ తుపాకీతో కాల్చుకుని సెంట్రీగా విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ స్వామి అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయాడు. బుధవారం నైట్ షిఫ్ట్ డ్యూటీ వచ్చిన స్వామి ఉదయం సరిగ్గా 5.30కి వాష్‌రూమ్ వెళ్లి అక్కడే పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో గన్‌తో షూట్ చేసుకుని రక్తపు మడుగులో పడిపోయాడు. అనంతరం గమనించిన తొటి సిబ్బంది అతడిని ఆస్పత్రికి తరలించాలని అనుకున్నప్పటికీ అప్పటికే మృతిచెందాడు. ఇక స్పాట్‌కు వెళ్లిన సైఫాబాద్ పోలీసులకు ఓ సూసైడ్ నోట్ కూడా లభించింది. అందులో మృతుడు స్వామి తన భార్య, పిల్లలను ఏమీ అనవద్దని రాసి ఉన్నట్లుగా గుర్తించారు. అదేవిధంగా కుటుంబ కలహాల నేపథ్యంలో తన ఆత్మహత్యకు కారణం ఇద్దరని లేఖలో ప్రస్తావించినట్లుగా తెలుస్తోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని.. అసలు స్వామి ఆత్మహత్యకు గల కారణలు ఏంటి? చివరిగా ఫోన్‌లో ఎవరితో మాట్లాడాడు అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.ప్రస్తుతం డీజీపీ కార్యాలయానికి క్లూస్ టీమ్ తో పాటు సైఫాబాద్ పోలీసులు చేరుకుని పూర్తి ఆధారాలను సేకరిస్తున్నారు. పంచానామా అనంతరం స్వామి డెడ్‌బాడీని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించబోతున్నట్లుగా తెలుస్తోంది. దాదాపు రెండు స్వామి డీజీపీ కార్యాలయంలో సెంట్రీగా విధులు నిర్వర్తిస్తున్నాడని తొటి సిబ్బంది పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి మరింత సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది.

# సోనమ్ బెయిల్ రద్దు చేసిన సుప్రీంకోర్టు

**న్యూ ఢిల్లీ:** దేశాన్ని షేక్ చేసిన మేఘాలయ హనీమూన్ మర్డర్ కేసులో ప్రధాన నిందితురాలు సోనమ్ రఘువంశీ కి సుప్రీంకోర్టులో తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది. ఆమెకు గతంలో మంజూరైన బెయిల్‌ను రద్దు చేస్తూ అత్యున్నత న్యాయస్థానం గురువారం కీలక తీర్పు వెలువరించింది. మూడు వారాల్లోగా ట్రయల్ కోర్టు ముందు లొంగిపోవాలని నిందితురాలిని ఆదేశించింది. జస్టిస్ ఎంఎం. సుందరేష్, జస్టిస్ పీవీ వరాలేల ద్విసభ్య ధర్మాసనం మేఘాలయ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపి ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ దశలో నిందితురాలు బెయిల్‌పై బయట ఉంటే విచారణ ప్రక్రియకు అడ్డంకులు ఏర్పడే అవకాశం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ఒకవేళ తదుపరి 6 నెలల్లోగా విచారణ పూర్తవ్వకపోతే, ఆమె మళ్లీ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.కాగా, ఇండోర్‌కు చెందిన వ్యాపారవేత్త రాజా రఘువంశీ, ఆయన భార్య సోనమ్ రఘువంశీ 2025 మే నెలలో హనీమూన్ కోసం మేఘాలయలోని సొహ్రా ప్రాంతానికి వెళ్లారు. అక్కడ మే 23న వారిద్దరూ కనిపించకుండా పోగా, జూన్ 2న రాజా రఘువంశీ మృతదేహం ఒక లోతైన లోయలో లభ్యమైంది. పోలీసుల దర్యాప్తులో సోనమ్ తన ప్రియుడు రాజ్‌కుమార్ , సుపారీ గ్యాంగ్‌తో కలిసి భర్తను దారుణంగా హత్య చేయించిన విషయం తెలిసిందే. గతంలో నిందితురాలి అరెస్టు మెమోలో సాంకేతిక లోపాలు ఉన్నాయనే కారణంతో హైకోర్టు బెయిల్ మంజూరు చేయగా, దానిని సవాలు చేస్తూ మేఘాలయ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ అది కేవలం టైపింగ్ పొరపాటని, అత్యంత తీవ్రమైన హత్య కేసులో అలాంటి సాంకేతిక కారణాలతో బెయిల్ ఇవ్వడం సరికాదని కోర్టుకు తెలిపారు. ఆయన వాదనలతో ఏకీభవించిన సుప్రీంకోర్టు ఇవాళ నిందితురాలు సోనమ్ రఘువంశీ బెయిల్‌ను రద్దు చేసింది.

# ఒక్కసారైనా సీఎంలా ప్రవర్తించు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనీసం ఒక్కసారైనా చీఫ్ మినిస్టర్‌లా ప్రవర్తించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గ్లోబరీనా సంస్థతో బీఆర్ఎస్‌కు గానీ తన కుటుంబానికి, తనకు గానీ ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. పేపర్ లీక్‌ల వంటి దురదృష్టకరమైన ఘటనపై రేవంత్ రెడ్డి తప్పుడు ప్రచారం చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. నిన్న కొడంగల్ ర్యాలీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'తెలంగాణలో 2019లో జరిగిన ఇంటర్ పరీక్షల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలకు పాల్పడటంతో 25 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని.. 2023 లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక పప్పులుడకవని అదే సంస్థ కేటీఆర్ సహకారంతో కేంద్రంలోని పెద్దలతో సంప్రదించి పేరు మార్చుకుందని ఆరోపించారు. ఇదే గ్లోబరీనా సంస్థ సీబీఎస్ఈ జవాబు పత్రాలను దిద్దే కాంట్రాక్ట్ తీసుకుని అవకతవకలకు పాల్పడిందని క్రమంలో ధర్మేంద్ర ప్రధాన్ తో ఒప్పందం చేసుకుని మరింతగా విజృంభించింది' అని చేసిన ఆరోపణలపై తాజాగా ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందిస్తూ సీఎం చేసిన ఆరోపణలను ఖండించారు.

**క్షమాపణలు చెప్పకుంటే లీగల్ నోటీసులు:**

పేపర్ లీక్ లాంటి దురదృష్టకర ఘటనపై ముఖ్యమంత్రి పదవిలో ఉంటూ బాధ్యతాయుతంగా రాహిత్యంతో చౌకబారు రాజకీయ ప్రయోజనాల కోసం అబద్ధాలను ప్రచారం చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై చేసిన ఆరోపణలను సీఎం వెంటనే ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని, లేదంటే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని కేటీఆర్ హెచ్చరించారు. ఈ మేరకు తన లీగల్ టీమ్ త్వరలోనే ముఖ్యమంత్రికి లీగల్ నోటీసు పంపనున్నట్లు హెచ్చరించారు. చాలా సందర్భాల్లో ముఖ్యమంత్రి అసభ్యకరమైన, అర్థంలేని ఆరోపణలకు నేను స్పందించను. అందుకని నేను అతడి ఆరోపణలతో ఏకీభవిస్తున్నానని కాదన్నారు. బురదలో కుస్తీ పట్టడం నాకు ఇష్టం లేదని అందుకే మౌనంగా ఉంటానని చెప్పారు.

**సీఐడీ విచారణకు సిద్ధమా రేవంత్ రెడ్డి?: కేటీఆర్**

గ్లోబరీనా సంస్థ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవం అని, ఆ సంస్థ తన బినామీ సంస్థ అని ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రికి ఇప్పటికే లీగల్ నోటీసులు పంపించినట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పారు. తనపై చేసిన చేసిన ఆరోపణలను రుజువు చేయాలని లేదంటే క్షమాపణ చెప్పాలన్నారు. ఈ విషయంలో తాను లై డిటెక్టర్ పరీక్షతో పాటు సీఐడీకి విచారణకు సిద్ధమని మరి రేవంత్ రెడ్డి తన కుటుంబ అవినీతి అంశంలో సిట్, సీఐడి విచారణకు సిద్ధమా? అని ప్రశ్నించారు. గ్లోబరీనా సంస్థ నిజంగానే నా బినామీ సంస్థే అయితే అదే సంస్థతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఒప్పందాలు చేసుకుందని కేటీఆర్ ప్రశ్నించారు. మీ ప్రభుత్వమే ఆ సంస్థతో ఒప్పందాలు చేసుకుని, ఇప్పుడు అది నా బినామీ సంస్థ అని చెప్పడం ఎంతవరకు సమంజసం అని నిలదీశారు. ఇవాళ వరంగల్ పర్యటన సందర్భంగా మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌లో మాట్లాడారు.

రాజ్ భవన్ ముందు చేయాల్సిన ధర్నా కొడంగల్‌లోనా?:కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి ఒక్కసారి కూడా ప్రధాని నరేంద్ర మోడీ పేరును ప్రస్తావించరని, రేవంత్ రెడ్డి మోడీ పేరును ప్రస్తావించడానికి కూడా భయపడుతున్నారని విమర్శించారు. రాజ్‌భవన్ ముందు ధర్నా చేయాల్సింది పోయి కొడంగల్‌లో ధర్నా చేయడం రాజకీయ నాటకం మాత్రమేనన్నారు. రేవంత్ రెడ్డి పగలు కాంగ్రెస్‌తో, రాత్రి బీజేపీతో ఉంటారని విమర్శించారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌కు ఒక మూట ఇస్తే, బీజేపీకి రెండు మూటలు పంపుతున్నాడని, కాంగ్రెస్‌కు ఒకటి, బీజేపీకి రెండు మూటలు ఇదే రేవంత్ రెడ్డి పాలన అన్నారు. ఒకవైపు పాత కేసుల భయం, మరోవైపు అమృత్ పథకం, ఇతర కాంట్రాక్టుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వంతో రాజీ రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

**గ్లోబల్ ఏరినా సంస్థతో నాకు సంబంధం లేదు**

గ్లోబల్ ఏరినా సంస్థ తన బినామీ సంస్థ అని ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలపై ఇప్పటికే పరువు నష్టం (డిఫమేషన్) లీగల్ నోటీసు పంపినట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. వరంగల్ జిల్లా మాడికొండలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. గ్లోబల్ ఏరినా సంస్థతో తనకు ఎలాంటి సంబంధం లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఆ సంస్థ నిజంగానే తన బినామీ సంస్థ అయితే, అదే సంస్థతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఒప్పందాలు చేసుకుందని ప్రశ్నించారు. ప్రభుత్వం ఒకవైపు ఆ సంస్థతో ఒప్పందాలు చేసుకుని, మరోవైపు అది తన బినామీ సంస్థ అని ఆరోపించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి ఒక్కసారి కూడా ప్రధాని నరేంద్ర మోదీ పేరును ప్రస్తావించలేదని విమర్శించారు. రాజ్‌భవన్ ముందు ధర్నా చేయాల్సింది పోయి కొడంగల్‌లో ధర్నా చేయడం రాజకీయ నాటకమేనని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పగలు కాంగ్రెస్‌తో, రాత్రి బీజేపీతో ఉంటారని ఆరోపించారు. "కాంగ్రెస్‌కు ఒక మూట, బీజేపీకి రెండు మూటలు పంపుతున్నది రేవంత్ రెడ్డి పాలన" అని విమర్శించారు. తాను సీఐడీ విచారణకు సిద్ధమని, అలాగే రేవంత్ రెడ్డి కుటుంబ అవినీతి ఆరోపణలపై సిట్ లేదా సీఐడీ విచారణకు ముఖ్యమంత్రి సిద్ధమేనా అని ప్రశ్నించారు. అవసరమైతే లై డిటెక్టర్ పరీక్షకు కూడా తాను సిద్ధమేనని, ముఖ్యమంత్రి కూడా అందుకు రావాలని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి మోదీ పేరును ప్రస్తావించడానికి కూడా భయపడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. పాత కేసుల భయం, అమృత్ పథకం తదితర కాంట్రాక్టుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వంతో రాజీ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. గ్లోబల్ ఏరినా సంస్థపై ముఖ్యమంత్రి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్న కేటీఆర్, ఆ ఆరోపణలను రుజువు చేయాలని, లేదంటే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పరువు నష్టం నోటీసు పంపినట్లు తెలిపారు.

# విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి..

**న్యూ ఢిల్లీ :** రాజ్యసభలో నీట్ పరీక్షల వివాదం, పేపర్ లీకేజీలపై ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పేపర్ లీక్ ఘటనకు బాధ్యతవహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పేపేర్ లీక్ నేపథ్యంలో రోడ్డుపైకి వచ్చి వేలు, లక్షల మంది నిరసన చేస్తున్నారని చెప్పారు. ఆందోళనలు చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీ ఛార్జ్ చేయడం, వారు ఆస్పత్రి పాలవ్వడంపై ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు బిడ్డల భవిష్యత్ పై ఆందోళన చెందుతున్నారని చెప్పారు.ముందుగా విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, ఆ తరవాత చర్చ జరపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ప్రధాని మోడీ నివాసం ముందు ఖర్గే, రాహుల్ గాంధీ సహా ఇతర నాయకులు నిరసన

వ్యక్తం చేస్తూ విద్యాశాఖమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీంతో వారిని అరెస్ట్ చేసి అక్కడ నుండి తరలించగా రాహుల్ గాంధీతో కేంద్రం చర్చలు జరిపింది.

ఈ నేపథ్యంలో కేంద్రం ముందు రాహుల్ ప్రధానంగా మూడు డిమాండ్లను పెట్టారు. డిమాండ్లకు కేంద్రం ఓకే చెబితే ఆందోళనలు విరమిస్తామని స్పష్టం చేశారు.

# ఘట్కేసర్ సర్కిల్ ఇంచార్జి ఏసీపీగా ఏ. శ్రీధర్



**ఘట్కేసర్,ఫ్లాష్ఇండియా పతినిధి :** కరీంనగర్ జిల్లా జిమ్మికుంట మున్సిపల్ టీపీఓ గా విధులు నిర్వర్తించిన ఏ.శ్రీధర్,ఎం ఎం సి పరిధిలోని ఘట్కేసర్ సర్కిల్ ఇన్‌చార్జి అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ)గా పదవీ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణదారులందరూ మున్సిపల్ నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలని, నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన కఠిన చర్యలు చేపడతామని తెలిపారు.

# వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..

## జన విజ్ఞాన వేదిక జాతీయ నాయకులు డాక్టర్ ముప్ప రామరావు





**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ పట్టణానికి చెందిన ప్రముఖ జ్యోతి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జన విజ్ఞాన వేదిక జాతీయ నాయకులు,జ్యోతి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ ముప్వ రామరావు కోరారు.గురువారం త్రిపురారం మండలం చెన్నైపాలెం గ్రామంలో జ్యోతి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు.గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు వైద్యం అందక అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఆయా ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వందలాదిమంది ప్రజలకు బిపి,షుగర్,గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు చెపా-ృరు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాము, మాజీ ఎంపీటీసీ చేన్నలు,బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్,వైద్య బృందం డాక్టర్లు వినీత్,సాయి,విక్రమ్,వైద్య సిబ్బందినాగేంద్రబాబు,నాగరాజు,విష్ణ, సంధ్య, రేణుక,ప్రత్యూష పాల్గొన్నారు

# భూముల రీ సర్వే వేగవంతం అవ్వాలి



**జనగాం,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** భూముల రీ సర్వేతో భూ సమస్యలు ఇక చెల్లు అవుతాయని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు జనగాం మండలం మరిగడి గ్రామం లో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు ఈ సందర్భంగా కలెక్టర్ ...ఇప్పటివరకు ఎన్ని ఎకరాలు చేసారు... ఇంకా ఎంత చేయాలి అని రెవెన్యూ, ల్యాండ్ అండ్ సర్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు భూ సమస్య లకు శాశ-్వత పరిష్కారం చూపించాలన్న లక్ష్యం తోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూముల రీసర్వే ప్రక్రియను ప్రారంభించింది అన్నారు గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పారదర్శకంగా భూముల రీసర్వే ప్రక్రియ గడువు లోగ జరగాలని అధికారులకు తెలిపారు అనంతరం పంటల గురించి కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ.... వర్షభావ ప్రభావం వల్ల... పంటలు వేసే ముందు అలోచించి వేయాలన్నారు. వరి పంట మీదనే ఆధార పడకూడదన్నారు ఎ పంటలు వేయాలో అవగాహన కోసం అధికారులని సంప్రదించాలన్నారు కోతుల సమస్య లేకుండా ఉండాలంటే కంది లాంటి పంటలను వేయాలన్నారు ఈ కార్యక్రమం లో ఆర్డీఓ గోపీరామ్, తహసీల్దార్,ల్యాండ్ అండ్ సర్వే AD తదితరులు పాల్గొన్నారు

# మిర్యాలగూడ నియోజకవర్గంలో భారీగా కాంగ్రెస్ ఆందోళనలు...



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రాహుల్,ప్రియాంకల అరెస్ట్‌కు నిరసనగా మిర్యాలగూడ నియోజకవర్గంలో ఉవ్వెత్తున లేచిన కాంగ్రెస్ ఆందోళనలు.దామరచర్ల,అడవిదేవులపల్లి, వేములపల్లి,మాడ్గులపల్లి మండలాల్లో రోడ్డెక్కిన కాంగ్రెస్ శ్రేణులు.దామరచర్ల మండల కేంద్రంలో నిరసనలో పాల్గొని ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేసిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి.ప్రశ్నించే గొంతులను కేంద్రం నొక్కుతోందని ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీ అక్రమ అరెస్టులను నిరసిస్తూ నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టాయి.రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మరియు టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు నియోజకవర్గ పరిధిలోని మండలాల్లోకాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి తమ నిరసన వ్యక్తం చేశారు.స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ ఆందోళన కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు కేంద్ర ప్రభుత్వానికి,ప్రధాని మోదీకి వ్యతిరేకంగా భారీ ఎత్తున నినాదాలు చేశారు.అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రశ్నించే గొంతులను అణచివేయడమే ధ్యేయంగా కేంద్రం పనిచేస్తుందని విమర్శించారు.రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీల ప్రజాదరణను చూసి ఓర్వలేకే అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.రాహుల్,ప్రియాంక గాంధీల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని,వారిపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలను ప్రజలే తిప్పికొడతారని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమాలలో నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షులు, వివిధ విభాగాల నాయకులు, యూత్ కాంగ్రెస్,ఎన్ఎస్‌యుఐ ప్రతినిధులు,భారీ సంఖ్యలో విద్యార్థులు,కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంట బీమా అమలయ్యే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తాం

## బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి





**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రాష్ట్రంలో అర్హులైన ప్రతి రైతుకు 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన' అమలు అయ్యే వరకు భారతీయ జనతా పార్టీ తరఫున పోరాటం కొనసాగిస్తామని బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. పంట బీమా పథకాన్ని రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, గురువారం ఊరుకొండ మండల కేంద్రంలో తహసీల్దార్ యూసుఫ్ అలీకి బీజేపీ బృందం వినతిపత్రం సమర్పించారు.అనంతరం మాట్లాడుతూ. ప్రకృతి విపత్తులు, ఇతర కారణాలతో పంట నష్టపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు పంట బీమా పథకం ఎంతో రక్షణ కల్పిస్తుందని పేర్కొన్నారు.రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆలస్యం చేయకుండా ఫసల్ బీమా పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, పలువురు మండల నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతుల ఇబ్బందులకు ప్రభుత్వ వైఫల్యాలే కారణం..

**నడిగూడెం,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులకు ప్రకృతి కారణాలతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలే ప్రధాన కారణమని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆరోపించారు. గురువారం నడిగూడెం మండల కేంద్రంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు, పార్టీ నాయకులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ ప్రభుత్వం అప్రమత్తం కాలేదని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందు చూపు లేదని, రైతులపై అసలు శ్రద్ధ లేదని విమర్శించారు. కరువు నివారణకు ముందస్తు చర్యలు చేపట్టకపోవడం, విత్తనాల లభ్యత, భూగర్భ జలాల పరిరక్షణ, చెరువుల నిర్వహణ వంటి అంశాల్లో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కాళేశ్వరం నీటి వినియోగంలో వైఫల్యం, రైతులకు సాగునీరు, 24 గంటల విద్యుత్, రైతు భరోసా అందించడంలో నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మొద్దు నిద్ర పోతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని మేలుకోల్పడానికే తాము రోడ్లపైకి రావాల్సి వస్తుందని, సబ్ స్టేషన్ లో ఎదుట బైఠాయించాల్సిన పరిస్థితి వచ్చిందని ఆక్షేపించారు. ఈ సీజన్‌లో పంటలు సాగు చేయలేక నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.25 వేల కరువు సాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ తో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు, సాగుకు అవసరమైన విద్యుత్ సరఫరాపై చర్చించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని బొల్లం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, సమన్వయకర్త ఆంజనేయులు, నాయకులు గార్లపాటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ఉపేందర్, నడిగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు ఉపేందర్, మాజీ సర్పంచ్ సుధాకర్, జలీల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ దంపతులకు ఉచిత ఆన్‌లైన్ ఐ వి ఎఫ్ కన్సల్టేషన్ శిబిరం

## జూలై 28న నిర్వహణ రిజిస్ట్రేషన్లు ప్రారంభం




**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో సంతానలేమి సమస్యతో బాధపడుతున్న దంపతులకు నిపుణులైన ఫెర్టిలిటీ వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో ఆర్ఎక్సపర్ట్ డిజిటల్ క్లినిక్స్ మామ్ ఐవిఎఫ్ సెంటర్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 28న ఉచిత ఆన్‌లైన్ ఐవిఎఫ్ కన్సల్టేషన్ శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ శిబిరంలో గర్భధారణ సమస్యలు ఫెర్టిలిటీ పరీక్షలు, ఐవిఎఫ్ చికిత్సకు సంబంధించిన అంశాలపై ప్రముఖ ఫెర్టిలిటీ నిపుణురాలు డా.పూర్ణిమ దుర్గ ఆమె వైద్య బృందం ఆన్‌లైన్ ద్వారా దంపతులకు సలహాలు అందించనున్నారు. హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఆర్ఎక్సపర్ట్ టెలీమెడిసిన్ వేదిక ద్వారా నిపుణులను నేరుగా సంప్రదించే అవకాశం కల్పించారు.శిబిరానికి రిజిస్ట్రేషన్లు ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలిపారు. ఆసక్తి గల దంపతులు తమకు సమీపంలోని ఆర్ఎస్పర్ట్ డిజిటల్ క్లినిక్‌లో నమోదు చేసుకోవచ్చని అక్కడ కోఆర్డినేటర్లు పూర్తి వివరాలు అందించి ఆన్‌లైన్ కన్సల్టేషన్‌కు అపాయింట్ మెంట్‌ను ఖరారు చేస్తారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా డి.ఆర్. పట్నాయక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని దంపతులు దూరం సమయం అధిక వైద్య ఖర్చుల కారణంగా ఫెర్టిలిటీ నిపుణులను సంప్రదించ లేకపోతున్నారని సాంకేతికత ద్వారా నాణ్యమైన ఐ వి ఎఫ్ వైద్య సేవలను వారి వద్దకే తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆసక్తి గల దంపతులు వెంటనే నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

# నల్లగొండ పట్టణంలో వైభవంగా ఆషాఢ గోరింటాకు పండుగ






**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నల్లగొండ పట్టణంలోని విద్యానగర్ కాలనీలో పార్క్ డెవలప్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ఆషాఢ మాస గోరింటాకు పండుగను మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పార్కులో గౌరీదేవికి,గోరింటాకు చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోరింటాకు ఆకులను నూరి సంప్రదాయబద్ధంగా చేతులకుఅలంకరించుకుని ఆనందోత్సాహాలతో సందడి చేశారు.ఆషాఢ మాసం విశిష్టతను చాటుతూ మహిళలు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొనడంతో పాటు పరస్పరం గోరింటాకు పెట్టుకుని పండుగ వాతావరణాన్ని సృష్టించారు.కార్యక్రమం అనంతరం అందరూ కలిసి వనభోజనాలు నిర్వహించి ఆత్మీయంగా గడిపారు. ఇలాంటి సంప్రదాయ కార్యక్రమాలు భారతీయ సంస్కృతి,కుటుంబ విలువలు,మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అబ్బగోని కవితా రమేష్‌తో పాటు చకిలం సంధ్యారాణి, గాయత్రి,గోవిందమ్మ,పద్మ, రజిని,లీలాదేవి,లక్ష్మి,ఉమా, సత్యమ్మ,భవాని,రేణుక, నీలిమ,యాదమ్మ, విజయలక్ష్మి,రజిత,గీత, తులసి తదితర మహిళలు పాల్గొన్నారు.

### 34 వ వార్డులో

పట్టణంలోని 34వ వార్డు బండారు గార్డెన్స్‌వద్ద మహిళలు ఆషాఢ మాస గోరింటాకు పండుగను సంప్రదాయబద్ధంగా,ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలు గోరింటాకు ఆకులను సేకరించి దంచి చేతులకు అలంకరించుకున్నారు.ఇలాంటి సంప్రదాయ వేడుకలు భారతీయ సంస్కృతి,కుటుంబ విలువలను పరిరక్షించడంతో పాటు మహిళల్లో ఐక్యతను పెంపొందిస్తాయని పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బండారు కళారాణి,బండారు రమణి,కుంభం జ్యోతి,కర్నాటి శ్రీలత,గందూరి ఉమా,కవిత,శ్రావణి,రెగట్టే పద్మ, విజయ,రాణి, దేవకి తదితర మహిళలు పాల్గొన్నారు.

# రామన్నపేట సీఐ గా ఎం. రవి బాధ్యతలు స్వీకరణ..



**రామన్నపేట,ఫ్లాష్ ఇండియా :** రామన్నపేట సర్కిల్ నూతన సీఐగా ఎం. రవి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన డీటీసీ జడ్చర్ల మహబూబ్ నగర్ జిల్లా నుండి రామన్నపేట సీఐ గా బదిలీ అయ్యారు. ఇక్కడ ఉన్న సీఐ ఎన్. వెంకటేశ్వర్లు మల్టీ జోన్ 2 కు రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా నూతన సీఐ ఎం. రవి మాట్లాడుతూ.. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే తమకు సమాచారం అందించాలని కోరారు.





# వైభవ్ సూర్యవంశీకి షాక్..

జింబాబ్వేతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా ఈరోజు హరారే వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. వరుసగా ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో ఒక్క టీ20 మ్యాచ్ కూడా గెలవలేకపోయిన టీమిండియా.. ఈ సిరీస్‌తో విజయాల బాట పట్టాలని భావిస్తోంది. కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు కూడా ఇది కీలక సిరీస్‌గా మారింది. అయితే తొలి టీ20 కోసం తుది జట్టును ఎంపిక చేయడం భారత జట్టు యాజమాన్యానికి పెద్ద సవాల్‌గా మారింది. ముఖ్యంగా ఓపెనింగ్ జోడీ విషయంలో సోషల్ మీడియాలో ఓ ఆసక్తికర చర్చ సాగుతోంది.

**వరుసగా మూడు ఇన్నింగ్స్‌ల్లో విఫలం:**

15 ఏళ్ల సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇంగ్లండ్ పర్యటనలో వరుసగా మూడు ఇన్నింగ్స్‌ల్లో విఫలమయ్యాడు. దాంతో అతడికి మరో అవకాశం దక్కుతుందా? అనే ప్రశ్న ప్రస్తుతం అభిమానుల్లో చర్చ-నీయాంశంగా మారింది. ఇంగ్లండ్ సిరీస్‌లో చివరి మ్యాచ్‌కు వైభవ్‌ను పక్కనపెట్టిన టీమ్ మేనేజ్‌మెంట్.. జింబాబ్వేపై అతడిని మళ్లీ బరిలోకి దింపనుంది. అయితే ఓపెనర్ స్థానానికి పంజాబ్ కింగ్స్ స్టార్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ కూడా పోటీలో ఉన్నాడు. వైభవ్ మాదిరే ప్రభ్‌సిమ్రన్ కూడా దూకుడుగా ఆడుతాడు. ఐపీఎల్ 2026లో అతడు పరుగుల వర్షం కురిపించిన నేపథ్యంలో ఓపెనింగ్ జోడిపై ఇప్పుడు అందరిలో ఆసక్తి నెలకొంది.

**కొత్త ఓపెనింగ్ జోడీని ట్రై చేయాలనుకుంటే:**

ప్రభ్‌సిమ్రన్ సింగ్ చాలా కాలంగా భారత జట్టులో అవకాశాల కోసం ఎదురుచూస్తున్నాడు. ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్‌కు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా ఉండటంతో.. ఇద్దరికీ మంచి అనుబంధం ఉంది. ఆ కారణంగా ప్రభ్‌సిమ్రన్‌కు జింబాబ్వేపై అవకాశం ఇవ్వొచ్చనే ప్రచారం జరుగుతోంది. అయితే తొలి మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీకే ఛాన్స్ దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అభిషేక్ శర్మతో కలిసి వైభవ్ ఓపెనింగ్ చేసే అవకాశాలే ఎక్కువ. ఒకవేళ అభిషేక్ శర్మతో కొత్త ఓపెనింగ్ జోడీని ట్రై చేయాలనుకుంటే.. బుడ్డోడికి షాక్ తప్పదు. ఇలా జరగడానికి కేవలం 1 శాతం మాత్రమే ఛాన్స్ ఉంది.

**రవి బిష్ణోయ్, హర్ష్ దూబేల మధ్య పోటీ:**

వికెట్‌కీపర్ ఇషాన్ కిషన్ మూడో స్థానంలో బ్యాటింగ్ చేయనున్నాడు. నాలుగో స్థానంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఐదో స్థానంలో తిలక్ వర్మ, ఆరో స్థానంలో శివమ్ దూబే, ఏడో స్థానంలో రింకూ సింగ్ బరిలోకి దిగనున్నారు. బౌలింగ్ విభాగంలో కూడా కొన్ని ఆసక్తికర నిర్ణయాలు ఉండనున్నాయి. స్పిన్నర్‌గా రవి బిష్ణోయ్, హర్ష్ దూబేల మధ్య పోటీ ఉన్నప్పటికీ.. దూబేకే తొలి మ్యాచ్‌లో అవకాశం లభించనున్నట్లు తెలుస్తోంది. పేస్ విభాగంలో అశోక్ శర్మ, యశ్ ఠాకూర్, ప్రిన్స్ యాదవ్‌లతో కూడిన త్రయం బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు మయాంక్ యాదవ్ కూడా జట్టులో ఉన్నప్పటికీ.. తొలి మ్యాచ్‌లో అతడికి విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

**తొలి టీ20కి భారత్ తుది జట్టు (అంచనా):**

అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ/ప్రభ్‌సిమ్రన్ సింగ్, ఇషాన్ కిషన్ (కీపర్), శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్, హర్ష్ దూబే, అశోక్ శర్మ/మయాంక్ యాదవ్, యశ్ ఠాకూర్, ప్రిన్స్ యాదవ్.

# టీమిండియాకు 'కరన్' గండం!



జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్‌కు భారత్ సిద్ధమవుతున్న వేళ, శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీకి తీవ్రమైన పరీక్ష ఎదురవుతోంది. నాయకత్వ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆడిన 7 మ్యాచ్‌ల్లోనూ భారత్ ఓటమి పాలైంది. కనీసం టాస్‌లు గెలిచినా, విజయాలు మాత్రం లభించలేదు. ఐర్లాండ్‌పై 0-2తో, ఇంగ్లండ్‌పై 0-4తో సిరీస్‌లను కోల్పోయిన టీమ్ ఇండియాకు, ఐర్లాండ్ కంటే బలంగా ఉన్న జింబాబ్వేను ఎదుర్కోవడం పెద్ద సవాలుగా మారింది. జూలై 23 నుంచి ప్రారంభమయ్యే ఈ సిరీస్‌లో బోణీ కొట్టాలని అయ్యర్ ఆరాటపడుతున్నాడు. ఇంగ్లండ్ పర్యటనలో ఆల్ రౌండర్ సామ్ కరన్ బౌలింగ్, బ్యాటింగ్‌తో భారత జట్టును దెబ్బతీశాడు. టీ20ల్లో 7 వికెట్లు, వన్డేల్లో 6 వికెట్లు తీసి ఇంగ్లండ్ సిరీస్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఇప్పుడు జింబాబ్వే పర్యటనలో అతని పెద్ద అన్నయ్య బెన్ కరన్ రూపంలో టీమ్ ఇండియాకు కొత్త భయం పట్టుకుంది. ఇప్పటికే జింబాబ్వే తరఫున టెస్టులు, వన్డేల్లో ఓపెనర్‌గా రాణించిన బెన్ కరన్, ఇప్పుడు భారత్‌పై టీ20 అరంగేట్రం చేసేందుకు సిద్ధమయ్యాడు. ఇంగ్లండ్ తరఫున ఆడే అవకాశం రాకపోవడంతో, బెన్ కరన్ 2024లో జింబాబ్వేకు మారాడు. నిజానికి తన తండ్రి కెవిన్ కరన్ జింబాబ్వే తరఫున అంతర్జాతీయ క్రికెట్ ఆడటంతో, బెన్ కూడా తండ్రి బాటలోనే నడుస్తూ జింబాబ్వే జెర్సీ ధరించాడు. అతని చిన్న తమ్ముడు సామ్ కరన్ ఇంగ్లండ్‌కు ఆడుతూ భారత్‌ను దెబ్బతీయగా, ఇప్పుడు పెద్ద తమ్ముడు బెన్ కరన్ జింబాబ్వే తరఫున భారత్‌కు ఎలాంటి సవాలు విసురుతాడోనని క్రీడాభిమానుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# భారత యాజమాన్యం నిర్లక్ష్యం..


టీమిండియా స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. ప్రతిష్టాత్మక ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్‌లో ఆడేందుకు సిద్ధమయ్యాడు. ప్రముఖ కౌంటీ క్రికెట్ క్లబ్ యార్క్‌షైర్‌తో కుల్దీప్ ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ సీజన్‌లో యార్క్‌షైర్ జట్టుకు కీలక సేవలు అందించనున్నాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో ఒక్క మ్యాచ్‌లో కూడా తుది జట్టులో చోటు దక్కకపోవడం, జింబాబ్వేతో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు కూడా ఎంపిక కాకపోవడంతో కుల్దీప్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఈ సీజన్‌లో యార్క్‌షైర్ తరఫున కుల్దీప్ యాదవ్ మొత్తం ఎనిమిది మ్యాచ్‌లు ఆడనున్నాడు. ఇందులో ఐదు వన్డే కప్ (మెట్రో బ్యాంక్ వన్‌డే కప్) మ్యాచ్‌లతో పాటు సెప్టెంబర్‌లో జరిగే కౌంటీ ఛాంపియన్‌షిప్ చివరి నాలుగు మ్యాచ్‌లలో మూడింట్లో బరిలోకి దిగనున్నాడు. ఈ శుక్రవారం గ్లామోర్గన్‌తో నీథ్ వేదికగా జరిగే 50 ఓవర్ల మ్యాచ్‌లో యార్క్‌షైర్ తరఫున కుల్దీప్ అరంగేట్రం చేయనున్నాడు. ప్రస్తుతం కుల్దీప్ ఇంగ్లీష్ గడ్డపైనే ఉన్న విషయం తెలిసిందే. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో భారత్ 1-2తో ఓటమిపాలైన విషయం తెలిసిందే. ఈ వన్డే సిరీస్‌లో కుల్దీప్‌కు ఒక్క మ్యాచ్‌లో కూడా ఆడే అవకాశం రాలేదు. చివరి వన్డేలో జస్ప్రీత్ బుమ్రా లేకపోయినా స్పిన్‌కు ప్రాధాన్యం ఇవ్వకుండా.. పేస్ బౌలర్లతోనే బరిలోకి దిగిన టీమ్ మేనే-జ్‌మెంట్ నిర్ణయంపై మాజీ క్రికెటర్లు తీవ్ర విమర్శలు చేశారు. ఆ మ్యాచ్‌లో భారత్ ముందుగా బౌలింగ్ చేసి 387 పరుగులు సమర్పించుకుని.. చివరకు 27 పరుగుల తేడాతో ఓడిపోయింది. అలాంటి పరిస్థితుల్లో కుల్దీప్‌ను పక్కన పెట్టడం సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇక జింబాబ్వే టీ20 సిరీస్‌కు కూడా సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చినా.. కుల్దీప్‌కు అవకాశం రాకపోవడంతో, మ్యాచ్ ప్రాక్టీస్ కోసం కౌంటీ క్రికెట్ ఆడాలని అతడు నిర్ణయించుకున్నాడు. శ్రీలంకతో ఆగస్టులో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌కు ముందు తన రిథమ్‌ను కొనసాగించేందుకు ఈ కౌంటీ అనుభవం ఉపయోగపడుతుందని భావిస్తున్నాడు. శ్రీలంక సిరీస్ అనంతరం మళ్లీ యార్క్‌షైర్ జట్టుతో కలిసి కౌంటీ ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లు ఆడనున్నాడు. యార్క్‌షైర్‌తో ఒప్పందం కుదుర్చుకున్న అనంతరం కుల్దీప్ తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. 'యార్క్‌షైర్ వంటి గొప్ప చరిత్ర కలిగిన క్లబ్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం ఎంతో గౌరవంగా భావిస్తున్నాను. ఇంగ్లండ్ పరిస్థితుల్లో బౌలింగ్ చేయడం ఎప్పుడూ నాకు సవాలే. జట్టు యాజమాన్యంతో మాట్లాడిన తర్వాత ఈ అవకాశంపై మరింత ఉత్సాహం కలిగింది. హెడ్డింగ్‌లేలో జట్టుకు నా వంతు సహకారం అందించేందుకు ఎదురుచూస్తున్నాను' అని చెప్పాడు. యార్క్‌షైర్ క్రికెట్ జనరల్ మేనేజర్ గావిన్ హామిల్టన్ కూడా కుల్దీప్ రాకపై సంతోషం వ్యక్తం చేశాడు. 'కుల్దీప్ అంతర్జాతీయ స్థాయిలో తన ప్రతిభను నిరూపించుకున్న ప్రపంచ స్థాయి స్పిన్నర్. ఈ వేసవిలో ఇంగ్లండ్‌లో పొడి వాతావరణం నెలకొనడంతో సీజన్ చివరి దశలో స్పిన్ కీలక పాత్ర పోషించనుంది. అతని లెఫ్ట్ ఆర్మ్ రిస్ట్ స్పిన్ మా బౌలింగ్ దళానికి కొత్త బలాన్ని అందిస్తుంది. అతని అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుంది' అని హామిల్టన్ వెల్లడించాడు. కుల్దీప్ ఇప్పటివరకు భారత తరఫున 18 టెస్టుల్లో 79 వికెట్లు, 121 వన్డేల్లో 194 వికెట్లు, 54 టీ20ల్లో 95 వికెట్స్ పడగొట్టాడు.



# బిజినెస్




# కొనసాగుతున్న నష్టాలు..




బుధవారం భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు గురువారం కూడా అదే బాటలో సాగుతున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతూనే ఉన్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర ప్రస్తుతం 95 డాలర్ల దగ్గర ట్రేడ్ అవుతోంది. మరోవైపు విదేశీ మదుపర్లు బుధవారం రూ.819 కోట్ల విలువైన షేర్లను అమ్మేశారు. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 96.51గా ఉంది. ఈ నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ భారీ నష్టాల్లో కదలాడుతున్నాయి. గత సెషన్ ముగింపు (76,755)తో పోల్చుకుంటే గురువారం ఉదయం 200 పాయిట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత కిందకు దిగజారింది. ఉదయం 9:45 గంటల సమయంలో సెన్సెక్స్ 308 పాయింట్ల నష్టంతో 76,446 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడుతోంది. ప్రస్తుతం 85 పాయింట్ల నష్టంతో 23,910 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్, నిఫ్టీలో ఫోర్స్ మోటార్స్, నాల్కో, వేదాంత, ఆయిల్ ఇండియా, నవుమా వెల్త్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, అదానీ గ్రీన్ ఎనర్జీ, పెట్రోనాట్ ఎల్ఎన్‌జీ, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, ఒరాకిల్ ఫిన్‌సెర్వ్ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 412 పాయింట్ల నష్టంతో ఉంది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 392 పాయింట్ల నష్టంతో ఉంది.

# పెరిగిపోతున్న బంగారం..



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒకవైపు యుద్ధంతో బాంబులు పేల్చుతోంటే.. మ-రోవైపు తన సరికొత్త ఫార్మా టారిఫ్స్ బాంబును ప్రపంచంపై వేశారు. దీంతో పాటు అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఆర్థిక పరిణామాలు మళ్లీ బంగారం రేట్లకు మె-రుపులు దిద్దుతోంది. దీంతో రోజురోజుకూ గోల్డ్ అండ్ సిల్వర్ లోహాల ధరలు పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో షాపింగ్ చేయాలనుకుంటున్న రెండు రాష్ట్రాల ప్రజలు ముందుగా తమ నగరాల్లోని రిటైల్ విక్రయ ధరలను పరిశీలించటం బెటర్. జూలై 23న బంగారం రేట్లు పెరిగాయి. జూలై 22 కంటే గ్రాముకు 24 క్యారెట్ల బంగారం రేటు దేశవ్యాప్తంగా గ్రాముకు రూ.77 పెరిగింది. దీంతో హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడప నగరాల్లో స్వచ్ఛమైన బంగారం రేటు రూ.14వేల 728గా కొనసాగుతోంది. ఈ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం రేటు గ్రాముకు రూ.13వేల 500గా కొనసాగుతోంది. గురువారం రోజున వెండి రేట్ల విషయానికి వస్తే.. జూలై 23, 2026న దేశవ్యాప్తంగా స్థిరంగా ఉన్నాయి. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడపలో కేజీ స్వచ్ఛమైన వెండి రేటు కేజీకి రూ.2లక్షల 45వేలుగా అమ్మబడుతోంది. అంటే గ్రాము దాదాపు రూ.245 దగ్గర ఉంది.

# గ్యాస్ సిలిండర్ ధరలు



గత నెలలో గ్యాస్ సిలిండర్ ధరల పెరుగుదలపై ప్రజలు ఆందోళన చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ నెల(జులై) ఒకటో తేదీన కేంద్ర ప్రభుత్వం హోటళ్లు, రెస్టారెంట్లు తదితర వ్యాపారులకు ఊరటనిస్తూ కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించింది. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.183 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.3,191గా ఉంది. ఇక, గృహ వినియోగ ఎల్‌పిజి ధరల్లో ఎలాంటి మార్పులు లేవు. నేడు(గురువారం) తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. జులై 23వ తేదీన గ్యాస్ సిలిండర్ ధరలు.. హైదరాబాద్‌లో రూ.994.00, వరంగల్‌లో రూ.1013.00గా ఉన్నాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో రూ.950.00, విజయవాడ రూ.966.50, గుంటూరులో రూ.966.50గా ఉన్నాయి.

# బ్యారెల్‌కు 100 డాలర్లకు చేరువలో ముడి చమురు..




ప్రపంచ చమురు మార్కెట్‌లో మరోసారి అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, ప్రపంచంలో అత్యంత కీలకమైన చమురు రవాణా మార్గంగా భావించే హోర్ముజ్ జలసంధి మూసివేయబడిందన్న వార్తలతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా ఎగబాకాయి. దీంతో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్లకు చేరువలో ట్రేడవుతుండటం ప్రపంచవ్యాప్తంగా ఆందోళనకు కార-ణమైంది.

**ముడి చమురు ధరలు ఎంత పెరిగాయి?**

తాజా ట్రేడింగ్‌లో బ్రెంట్ క్రూడ్ ధర దాదాపు 2 శాతం పెరిగి బ్యారెల్‌కు 96 డాలర్లకు చేరుకుంది. మరోవైపు అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ముడి చమురు ధర కూడా పెరిగి బ్యారెల్‌కు 88.24 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఈ రెండు అంతర్జాతీయ బెంచ్‌మార్క్‌లు గత ఆరు వారాల్లో అత్యధిక స్థాయికి చేరుకోవడం గమనార్హం.

**హోర్ముజ్ జలసంధి ఎందుకు కీలకం?**

ప్రపంచ చమురు సరఫరాలో హోర్ముజ్ జలసంధి అత్యంత కీలకమైన మార్గంగా గుర్తింపు పొందింది. గల్ఫ్ దేశాల నుంచి ఎగుమతి అయ్యే ముడి చమురులో గణనీయమైన భాగం ఈ మార్గం ద్వారానే ప్రపంచ దేశాలకు చేరుతుంది. ఈ సముద్ర మార్గంలో అంతరాయం ఏర్పడితే ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరా తగ్గే అవకాశం ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలపై అదనపు భారం పడే అవకాశం ఉంది. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగితే ఇంధన ధరలపై ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపే అవకాశం ఉంది.

**భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు**

అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరిగినప్పటికీ, ప్రస్తుతం భారతదేశంలో పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఇండియన్ ఆయిల్ , భారత్ పెట్రోలియం , హిందుస్థాన్ పెట్రోలియం ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు ఇంధన ధరలను సమీక్షించి ప్రకటిస్తున్నాయి. అయినప్పటికీ ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా వంటి ప్రధాన నగరాలతో పాటు దేశంలోని చాలా ప్రాంతాల్లో ధరలు స్థిరంగానే కొనసాగుతున్నాయి.

**ప్రస్తుతం ఇంధన ధరలు**

పెట్రోల్ ధర: లీటరుకు రూ.102.12

డీజిల్ ధర: లీటరుకు రూ.95.30

**భవిష్యత్తులో ధరలు పెరిగే అవకాశం ఉందా?**

భారత్ తన ముడి చమురు అవసరాల్లో అధిక భాగాన్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు దీర్ఘకాలం పాటు అధిక స్థాయిలో కొనసాగితే, భవిష్యత్తులో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలపై ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ప్రస-్తుతం ప్రభుత్వ చమురు సంస్థలు ఇంధన ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదు. అంతర్జాతీయ పరిస్థితులు ఎలా మారతాయో బట్టి రాబోయే రోజుల్లో ధరలపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. మధ్యప్రాచ్య ఉద్రిక్తతలతో ప్రపంచ చమురు మార్కెట్ మరోసారి ఒత్తిడిని ఎదుర్కొంటోంది. హోర్ముజ్ జలసంధి పరిస్థితి, ముడి చమురు సరఫరా, అంతర్జాతీయ ధరల మార్పులు రాబోయే రోజుల్లో కీలకంగా మారనున్నాయి. ప్రస్తుతం భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగానే ఉన్నప్పటికీ, ప్రపంచ మార్కెట్ పరిణామాలపై వినియోగదారులు దృష్టి ఉంచాల్సిన అవసరం ఉంది.

# చెప్పినట్లు వినలేదు అని నా నుంచి...

బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా దూసుకుపోతున్న ప్రియాంకా చోప్రా.. త్వరలో మహేశ్ బాబు, రాజమౌళి కలయికలో వస్తోన్న 'వారణాసి' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నది. ఈ క్రమంలోనే వరుస ఇంటర్వ్యూస్‌లో పాల్గొంటున్న ఈ అమ్మడు.. తాజాగా చేసిన కామెంట్స్‌తో వార్తల్లో నిలిచింది. 'కొందరిని మెప్పించనందుకు, వారు చెప్పినట్లుగా నేను చేయనందుకు నా సినిమా అవకాశాలు నా నుంచి లాగేసుకున్నారు. ఇతరులు రాజీ పడినట్లుగా, నేను దానికి ఇష్టపడలేదు. కొందరు స్టార్ హీరోలు నన్ను ఉద్దేశపూర్వకంగా సినిమాల నుంచి తప్పించారు. 2007లో 'సలామ్ ఎ ఇష్క్' షూటింగ్ సమయంలో నాకు వేరే సినిమా అవకాశం వచ్చింది. ఆ చిత్ర హీరో ఒకసారి నా దగ్గరకు వచ్చారు. అయితే.. సినిమా స్టార్ట్ అవ్వడానికి నెల రోజుల టైమే ఉండటంతో చర్చించడం కోసం వచ్చారేమో అనుకున్నా.. కానీ నేను ఊహించని విధంగా 'దర్శకుడు ఈ సినిమాను పొరపాటున నీకు ఇచ్చారు.. నిజానికి ఈ పాత్ర వేరే హీరోయిన్‌ది.. మనం త్వరలో మరో సినిమా చేద్దాం' అని చెప్పారు. దీంతో నేను షాక్ అయ్యాను. ఆ టైంలో నా కెరీర్ గురించి ఆలోచించి నటనపై పూర్తి దృష్టి పెట్టాను. అయితే.. ఇలాంటి నా సినీ కెరీర్‌లో ఒకసారి కాదు.. చాలా సార్లు జరిగింది. ఈ విషయాల గురించి నేను ఎక్కువగా మాట్లాడలేను' అంటూ సంచలన వ్యాఖ్యలు చేసింది ప్రియాంక.





# ఓవర్సీస్ రివ్యూ.. వద్దు బ్రో


కోలీవుడ్ దళపతి విజయ్ నటించిన చివరి చిత్రం జన నాయగన్ తెలుగులో జన నాయకుడు ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హెచ్. వినోద్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ పొలిటికల్ అండ్ యాక్షన్ డ్రామాపై అభిమానుల్లో బిజినెస్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఓవర్సీస్ ప్రీమియర్స్ మరియు తొలి షోల నుంచి వస్తున్న స్పందన మాత్రం నిరాశపరిచేలా ఉంది. బాలయ్య హిట్ సినిమా భగవంత్ కేసరి రీమేక్ గా వచ్చిన సినిమా ప్రారంభం కొన్ని టెంప్లేట్ ఎలివేషన్ సీన్లు మినహా కథనంలో ఎక్కడా సరైన నేపథ్యం లేదు. అయితే ఇంటర్వెల్ సీన్ మాత్రమే కాస్త ఊరటనిచ్చేలా ప్రధాన హైలైట్‌గా నిలిచింది. విజయ్ ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రజెన్స్, అనిరుధ్ నేపథ్య సంగీతం సినిమాని అక్కడక్కడా నిలబెట్టే ప్రయత్నం చేసినప్పటికీ, దర్శకుడి రొటీన్ ఫ్లాట్ మేకింగ్ కారణంగా సినిమా పట్టుతప్పింది. కథను నడిపించడంలో దర్శకుడు హెచ్. వినోద్ పూర్తిగా తడబడ్డారు. (భగవంత్ కేసరి నుండి కుమార్తె సెంటిమెంట్‌ను కొర్ పాయింట్ గా తీసుకున్నప్పటికీ దాన్ని సరిగ్గా ఎస్టాబ్లిష్ చేయకపోవడంతో ఎమోషన్ పండలేదు. ఇక విలన్‌గా నటించిన బాబీ డియోల్ పాత్ర పూర్ గా కొన్నిచోట్ల నవ్వు తెప్పించేలా డిజైన్ చేశారు. వీఎఫ్ఎక్స్ వర్క్, ఎడిటింగ్ ప్రొడక్షన్ వాల్యూస్ సినిమా స్థాయికి తగ్గట్టుగా లేకపోవడం ప్రధాన లోపంగా మారింది. సినిమాలోని ప్రధాన సన్నివేశాలన్నీ ఎటువంటి సరైన ఫ్లో లేకుండా ఒకదాని తర్వాత ఒకటి చుట్టేసినట్లుగా అనిపిస్తాయి, ముఖ్యంగా క్లైమాక్స్ ఆశించనంత ఉండదు. మొత్తానికి 'జన నాయగన్' చిత్రం విజయ్ మాస్ ఇమేజ్ మరియు అనిరుధ్ మ్యూజిక్ మీదే నడిచే ప్రయత్నం చేసినప్పటికీ బలహీనమైన కథనం పూర్ డైరెక్షన్ తీరు వల్ల ' డిసప్పాయింటింగ్ అనిపించుకుంటోంది.

# బరిలోకి దిగనున్న విశాల్!




కోలీవుడ్ హీరో విశాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మకుటం'. తమిళంలో 'మగుడం' పేరుతో రాబోతుంది. ఈ సినిమాతో విశాల్ దర్శకుడిగా తన కొత్త ప్రయాణాన్ని మొదలు పెట్టడం విశేషం. అంతేకాకుండా ఇందులో ఆయన త్రీపాత్రిభినయం అంటే మూడు విభిన్నమైన పాత్రల్లో కనిపించబోతున్నారు. ఈ హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామాలో దుషారా విజయన్, అంజలి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ 'సూపర్ గుడ్ ఫిల్మ్స్' బ్యానర్‌పై ఆర్.బి. చౌదరి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్లు, టీజర్ మరియు గ్లింప్స్‌కి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. దీంతో ఈ సినిమా ఎప్పుడెప్పుడు థియేటర్లలోకి వస్తుందా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతుండటంతో ఈ సినిమాను స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు, స్టార్ హీరో సూర్య, 'సర్కార్ వారి పాట' ఫేమ్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో నటిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రం కూడా ఆగస్టు 14నే విడుదల కాబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తున్న ఈ ఫ్యామిలీ డ్రామాపై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. ఒకవేళ ఆగస్టు 14 రేసులో ఈ రెండు సినిమాలు పోటీ పడితే, బాక్సాఫీస్ వద్ద విశాల్, సూర్య మధ్య భారీ ఫైట్ జరగడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# మిగిలి ఉన్న పోర్షన్స్ ఇవే



ప్రస్తుతం ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.అయితే ఇంకా పెద్ద స్థాయిలో షూటింగ్ పెండింగ్‌లో ఉండటంతో, సెప్టెంబర్‌లోనైనా సినిమా విడుదలవుతుందా అనే సందేహాలు ఇండస్ట్రీ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రానికి సంబంధించిన భారీ క్లైమాక్స్‌తో పాటు ఓ ఐటమ్ సాంగ్ చిత్రీకరణ పూర్తి కావలసి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కీలక భాగాలను పూర్తి చేయడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో మేకర్స్ అనుకున్న సమయానికి షూటింగ్ పూర్తి చేసి సెప్టెంబర్ 25న సినిమాను విడుదల చేస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రంలో ఖయాదు లోహర్ కథానాయికగా నటిస్తుండగా, మోహన్ బాబు, సంపూర్ణేష్ బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సుధాకర్ చెరుకూరి తన ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు.




# బాలీవుడ్‌లో మరో పెద్ద అవకాశం దక్కనున్నదా!

ఈ మూవీకి దర్శకుడు జై మెహతా దర్శకత్వం వహించనుండగా, త్వరలోనే సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం. జాంబీ నేపథ్యంలో సాగే ఈ కథలో ఉత్కంఠభరితమైన యాక్షన్‌తో పాటు బలమైన కంటెంట్ కూడా ఉంటుందని మేకర్స్ చెబుతున్నాయి. అందుకే ప్రతి పాత్రకు సరిపోయే నటీనటులను ఎంపిక చేయడంపై చిత్రబృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇటీవల విడుదలైన 'లోక' చిత్రంలో సూపర్ హీరో పాత్రలో కళ్యాణి ప్రియదర్శన్ నటనకు మంచి ప్రశంసలు లభించాయి. ఆ సినిమాలో ఆమె చూపించిన స్క్రీన్ ప్రెజెన్స్ కు ప్రేక్షకులు కూడా ఫిదా అయ్యారు. అదే కారణంగా 'ప్రళయ్'లోనూ బలమైన మహిళా పాత్ర కోసం ఆమె పేరును పరిశీలిస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ ప్రాజెక్ట్ ఖరారైతే కళ్యాణి ప్రియదర్శన్‌కు ఇది బాలీవుడ్‌లో ఒక కీలక మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది. ఇప్పటికే దక్షిణాది చిత్రాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ఆమె, ఇప్పుడు హిందీ చిత్రసీమలో కూడా అడుగుపెడితే కెరీర్‌కు కొత్త దిశ లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు రణవీర్ సింగ్ వంటి స్టార్ హీరోతో తొలిసారి జతకట్టే అవకాశం రావడం కూడా ఆమె కెరీర్ కు కీలక మలుపుగా మారనుంది. అయితే ఇప్పటివరకు చిత్రబృందం నుంచి కళ్యాణి ప్రియదర్శన్ ఎంపికపై అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ఈ వార్త సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతోంది. రణవీర్ సింగ్ అభిమానులతో పాటు దక్షిణాది ప్రేక్షకులు కూడా ఈ కాంబినేషన్ నిజమవుతుందా అనే ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. అధికారిక ప్రకటన వచ్చిన తర్వాత ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.



Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**